ప్రజాశక్తి

సోమవారం 30 జనవరి 2023 8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

భళా...బాలోత్సవం

- అలరించిన నాటికలు
- ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు
- వ్యర్థాల ద్వారా వస్తువుల తయారీలో ప్రావీణ్యం
- అద్భుత ప్రదర్శనలతో పండుగ వాతావరణం

అమరావతి బాలోత్సవం ఐదవ పిల్లల పండుగ ఆదివారం పొట్టిశ్రీరాముల చలువాది మల్లిఖార్జునరావు ఇంజనీరింగ్ కళాశాలలో అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. కృష్ణా, ఎన్‌టిఆర్, గుంటూరు, ఏలూరు జిల్లాల నుంచి 161 పాఠశాలలకు చెందిన 7,500 మంది విద్యార్థులు వివిధ సాంస్కృతికాంశాలలో పాల్గొని తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. దీంతో కళాశాల ప్రాంగణం కోలాహలంగా కనిపించింది. ఉత్సవంలో జానపద గీతాలు అలరించాయి. నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వ్యర్థాల నుంచి ఆకర్షణీయమైన వస్తువుల తయారీలో బుడతలు తమ ప్రావీణ్యాన్ని ప్రదర్శించారు. లఘు నాటికలు అలరించాయి. తమ అద్భుత ప్రదర్శనలతో పండుగ వాతావరణం నెలకొంది. విద్యార్థులు తమ హావభావాలతో ఆకట్టుకున్నారు. బాలోత్సవం తొలిరోజున ఆద్యంతం పిల్లల ఆనందోత్సాహాల మధ్య హుషారుగా సాగింది.

(పూర్తి వివరాలు మెయిన్, టాబ్లాయిడ్ 2,8వ పేజీల్లో)

ధాన్యంపై అయోమయం

- దిగుబడులు 10 లక్షల టన్నులు
- సేకరణ లక్ష్యం 5.20 లక్షలు మాత్రమే
- 47 మిల్లుల్లో కొనుగోళ్లు నిలిపివేత
- ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

ప్రభుత్వం నిర్దేశించిన ధాన్యం సేకరణ లక్ష్యం దగ్గర పడింది. జిల్లాలో మొత్తం 5.20 లక్షల టన్నులు సేకరణ లక్ష్యంగా నిర్ణయించగా, ఈ నెల 28 నాటికి 3.90 లక్షలు టన్నుల సేకరణ పూర్తయింది. మరో 1.30 లక్షల టన్నుల సేకరణకు మాత్రమే అవకాశం ఉంది. 180 రైస్ మిల్లులకుగాను లక్ష్యం పూర్తయిన కారణంగా 47 మిల్లుల్లో ధాన్యం కొనుగోళ్లు నిలిపివేశారు. లక్ష్యం పూర్తయిన మిల్లలకు సేకరించిన ధాన్యం రవాణా చేయవద్దని ఆర్‌బికెలకు సూచిస్తూ వాటి జాబితాను అందించారు.

జిల్లాలో సాగైన వరిపంటకు సంబంధించి 10 లక్షల టన్నుల ధాన్యం దిగుబడులు వస్తాయని అంచనా. దీనిలో సన్న రకంతోపాటు ఇతర రకాలకు సంబంధించి స్థానిక అవసరాలకు రెండు లక్షల టన్నులు వినియోగం జరుగుతుంది. 8 లక్షల టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించాలి. అయితే 5.20 లక్షల టన్నులు మాత్రమే లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించింది. సేకరించాల్సిన ధాన్యానికీ, లక్ష్యానికీ మధ్య మూడు లక్షల టన్నుల వ్యత్యాసం ఉంది. మొదటి దశలో హార్వెస్టింగ్ చేసిన ధాన్యం విక్రయాలు జరిగాయి. ప్రస్తుతం కుప్ప నూర్పిళ్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. మిగిలిన 1.30 లక్షల టన్నుల సేకరణ లక్ష్యం సైతం ఫిబ్రవరి 10వ తేదీలోపు పూర్వయ్యే అవకాశం ఉంది. ఖరీఫ్ వరి మాగాణుల్లో రెండో పంటగా అపరాలు సాగు చేశారు. అపరాలు సాగు పూర్తయిన తర్వాత మార్చి నెలాఖరుకు, ఏప్రిల్ మొదటి వారంలో మరికొన్ని ప్రాంతాల్లో ధాన్యం అమ్మకానికి వస్తుంది. ఇప్పటికే కొన్ని రైస్ మిల్లుల్లో కొనగోళ్లు నిలిపివేయడంతో సమీపంలోని గ్రామాల రైతులు దూర ప్రాంతాలకు ధాన్యం రవాణా చేయాల్సి వస్తోంది. లక్ష్యాన్ని పెంచి పూర్తి స్థాయిలో రైతుల నుంచి పూర్తి స్థాయిలో ధాన్యం సేకరించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఆరు కేంద్రాల ద్వారా పత్తి కొనుగోలు

- రూ.22.42 కోట్ల మార్కెటింగ్ ఫీజు లక్ష్యం
- త్వరలో విజయవాడలో రెండు రైతు బజార్లు ప్రారంభం
- ప్రజాశక్తితో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఎడి ఎ.కిషోర్

ప్రజాశక్తి - విజయవాడ : ఎన్‌టిఆర్ జిల్లాలో ఆరు పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు అగ్రిట్రేడ్, మార్కెటింగ్ శాఖ ఎన్‌టిఆర్ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ (ఎడి) ఎ కిషోర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారం, కలెక్టర్ ఎస్.డిల్లీరావు, మార్కెటింగ్‌శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్‌జెడి) కె.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు అగ్రిట్రేడ్, మార్కెటింగ్ శాఖ విస్తరణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలో చేపడుతున్న పలు కార్యకలాపాలపై అసిస్టెంట్ డైరెక్టర్ కిషోర్ ప్రజాశక్తికి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న : జిల్లాలో పత్తి కొనుగోలు కేంద్రాలు ఎన్ని ఏర్పాటు చేశారు?

ఎన్‌టిఆర్ జిల్లా పరిధిలో ఈ ఏడాది కంచకచర్ల, జగ్గయ్యపేట, నందిగామ, మైలవరం, గంపలగూడెం, ఎ.కొండూరు ప్రాంతాల్లో పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాం. రైతులు తమ పంటను విక్రయించుకునేందుకు ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకొని యార్డుకు తీసుకొస్తే నిర్ణయించిన ధరకు అమ్ముకోవచ్చు. ఇక్కడ ఎటువంటి మోసాలకు తావుండదు. మార్కెటింగ్‌శాఖ క్వింటా పత్తి ధర రూ.6,380 నిర్ణయించగా, అదే బయట మార్కెట్లో రూ.7 వేల నుండి రూ.8 వేల వరకు ధర పలుకుతుంది. ఎక్కువ మంది రైతులు బయట మార్కెట్

(మిగతా 6లో)

సదస్సులో మాట్లాడుతున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు

ఆర్‌ఎస్‌ఎస్ భావాజాలంపై ఐక్య ఉద్యమం

- 'భారత్ బచావో' సదస్సులో నేతల పిలుపు
- విశాఖ హక్కును రక్షించుకోవాలి

వార్త 6లో

చల్లపల్లిలో సమరయాత్రకు స్వాగతం పలుకుతున్న నేతలు

వార్త 6లో

'కృష్ణా'లోకి సమరయాత్ర

- చల్లపల్లిలో ఘన స్వాగతం
- ప్రత్యేక హోదా, విభజన హామీలుపై కేంద్ర వైఖరిని ఎండగట్టిన నేతలు

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-విజయవాడ: స్థానిక 15వ డివిజన్ రామలింగేశ్వరనగర్ రజిత భార్గవి స్ట్రీట్ వినోద్ పబ్లిక్ స్కూల్లో శ్రీ శ్రీనివాస హాస్పటల్, ది గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం వారి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. డిప్యూటీ మేయర్ బెల్లందుర్గ శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ డివిజన్ ప్రజలకు ఉచిత వైద్యసేవలు అందించాలనే ఉద్దేశ్యంతో శ్రీనివాస వైద్యశాల, గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ముందుకు రావడం అభినందనీయమన్నారు. పెద్దలకు షుగర్, బీపీ టెస్టులు చేసి ఉచితంగా మందులు ఇవ్వటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ ఆళ్ల చల్లారావు, డాక్టర్ సంధ్యారాణి, డాక్టర్ సత్య శ్రీనివాస్, స్టేట్ జాయింట్ సెక్రెటరీ డాక్టర్ ఎంఎన్‌రాజు, టిఎం కొండారెడ్డి, ఎండి ఉస్మాన్, జె రవీంద్రబాబు, బి మోహన్, ఎం ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.

పౌరాణిక కళాకారుడు కటారి మృతి

ప్రజాశక్తి-విజయవాడ రూరల్: నున్న గ్రామానికి చెందిన పౌరణిక కళాకారుడు కటారి సత్యనారాయణ (70) ఆదివారం మృతిచెందారు. కళా రంగంతో పాటు చిరు వ్యాపారునిగా సత్యనారాయణ జీవనం సాగిస్తున్నారు. గత కొద్దినెలలుగా అనారోగ్యానికి గురైన ఆయన ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇది గమనించిన స్థానికులు వెంటనే విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి-సింగ్‌నగర్: భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్య చేసుకున్న సంఘటన సింగ్‌నగర్‌లో చోటేచేసుకుంది. సింగ్‌నగర్ వాంబే కాలనీలో నల్ల శివశంకర్, నల్ల కుమారి (35) నివాసం ఉంటున్నారు. వీరికి 20 సంవత్సరాల క్రితం వివాహమైంది. కుమారుడు, కుమార్తె ఉన్నారు. శివశంకర్ సీలింగ్ పనులు చేస్తూ ఉంటాడు. శివశంకర్ రోజూ తాగి వచ్చి భార్యను వేధిస్తుండేవాడు. 27వ తేదీ రాత్రి శివశంకర్ భార్యతో తగాదా పడి కొట్లాడు. 28న కుమారి తన తల్లికి ఫోన్ చేసి తనకు బతకాలని లేదని, పాయిజన్ తాగానని చెప్పింది. దీంతో కుమారిని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చంద్రబాబును కలిసిన ఎంఎస్ బేగ్

ప్రజాశక్తి-వన్‌టౌన్: టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడుని హైదరాబాదులోని జూబ్లీహిల్స్‌లో ఆయన స్వగహంలో విజయవాడ పశ్చిమ నియోజకవర్గ టిడిపి మైనార్టీ నాయకులు ఎం.ఎస్ బేగ్ కుటుంబ సభ్యులు కలిశారు. చంద్రబాబును కలిసిన వారిలో డాక్టర్ బాబీ బేగ్ (యుఎస్ఎ), ఎంఎస్. బేగ్, షకీలా బేగం, అబ్దుల్ ఖదిర్ తదితరులు ఉన్నారు.

లోకేష్‌కు పాదయాత్ర చేసే అర్హతలేదు : గౌస్

ప్రజాశక్తి-వన్‌టౌన్: లోకేష్‌కు పాదయాత్ర చేసే అర్హత లేదని, తమ హయాంలో సంక్షేమాన్ని గాలికి వదిలి ఏ ముఖం పెట్టుకొని ప్రజల వద్దకు వెళ్తారని వైసిపి మైనారిటీ జిల్లా అధ్యక్షులు షేక్ గౌస్ మొహిద్దీన్ విమర్శించారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంక్షేమ, అభివృద్ధి పాలనతో ప్రతి ఇంటికీ చేరువైన వైసిపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పాదయాత్ర చేస్తే ప్రజలు చీపుర్లు, చెప్పులతో సత్కారం చేస్తారన్నారు. అందుకే 400 మంది వాలంటీర్లు, 200 మంది బౌన్సర్లను అడ్డుపెట్టుకుని పాదయాత్ర చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

ధైర్యంగా ఉన్నత శిఖరాలను అధిరోహించండి

కేంద్ర సాహిత్య అకాడమీ గ్రహీత వెంకటరమణ, ఎంఎల్‌సి లక్ష్మణరావు

మాట్లాడుతున్న ఎంఎల్‌సి కె.ఎస్.లక్ష్మణరావు

ప్రజాశక్తి-వన్‌టౌన్: జీవితంలో దేనికి భయకుండా ధైర్యంగా ముందుకెళ్లి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కేంద్ర సాహిత్య అకాడమీ గ్రహీత చొక్కాపు వెంకటరమణ విద్యార్థులకు పిలుపునిచ్చారు. అమరావతి బాలోత్సవం (ఐదో పిల్లల పండుగ) సందర్భంగా ఆదివారం కొత్తపేట కెబిఎన్ కళాశాల మీటింగ్ హాల్లో ముఖ్య అతిధులతో ఏర్పాటు చేసిన సెమినార్లు విద్యార్థులను ఆకట్టుకున్నాయి. కెబిఎన్ కళాశాల ప్రిన్సిపల్ వంగల నారాయణరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో తొలుత 'విద్యార్థులు - సాంస్కృతిక వికాసం' అనే అంశంపై వెంకటరమణ మాట్లాడుతూ విద్యార్థులకు జీవితంలో ఆటలు పాటలు కూడా భాగంగా కావాలన్నారు. విద్యార్థులు విద్యతో పాటు కళలు సాహిత్యం, ఆర్ట్స్ డ్రాయింగ్ వంటి అంశాలపై పట్టు సాధించాలని వీటి ద్వారా విద్యార్థులకు మానసిక ప్రశాంతత చేకూరడంతో పాటు ఒత్తిడి జయించవచ్చని తెలిపారు. పోటీ ప్రపంచంలో విద్యా వ్యవస్థలో వచ్చిన మార్పుల ద్వారా విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి ఎక్కువైందని ప్రతిఒక్కరూ కూడా కళలు, సాహిత్యం, యోగా ద్వారా ఒత్తిడిని జయించి తమ కలలను నిజం చేసుకోవాలని అన్నారు. కళారూపాలను సిలబస్‌లో పెట్టి పాఠ్యాంశాలుగా చేర్చవలసిన అవసరం ఉందన్నారు. స్మార్ట్‌ఫోన్లలో మంచి, చెడు రెండూ ఉన్నాయని, మంచిని మాత్రమే వినియోగించుకోవాలని కోరారు. మాతృభాష ప్రాముఖ్యతను, చదువు యొక్క ఆవశ్యకతను ఆయన కథ రూపంలో ఆసక్తిగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో చెప్పారు.

అందరికీ విద్య అందుబాటులో ఉండాలి :లక్ష్మణరావు

కుల మతాలకు అతీతంగా అందరికీ విద్య అందుబాటులో ఉండే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమవతు పాత్ర పోషించాలని కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు తెలిపారు. బాలోత్సవంలో భాగంగా 'నేటి విద్యా వ్యవస్థ - శాస్త్రీయ ఆలోచన అనే అంశంపై లక్ష్మణరావు ప్రసంగిస్తూ నేటి సమాజంలో విద్య సామాన్యులకు అందని ద్రాక్షగా ఉందన్నారు. స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు గడిచిన అనేక మంది పేద పిల్లలు ఉన్నత విద్యకు దూరంగా ఉన్నారన్నారు. సంఘటిత, అసంఘటిత రంగాల్లో పారిశ్రామిక వాడల్లో చైల్డ్ లేబర్‌గా పనిచేస్తూ అనేకమంది విద్యకు నోచుకోవడం లేదన్నారు మధ్యతరగతి ప్రజలుకూడా తమ పిల్లలకు ఉన్నత విద్యను అందించలేకపోతున్నారనీ కారణం 1990వ దశకం తర్వాత ఆర్థిక సంస్కరణలో మార్పుల వల్ల ప్రభుత్వాలు ప్రవేట్ రంగాన్ని ప్రోత్సహించడం వల్ల కొన్ని విద్యా సంస్థలు ధనార్జనే ధ్యేయంగా ముందుకు సాగుతున్నాయన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగంలో ప్రతి ఒక్కరికీ చదువు అందాలని చెప్పిన అంశం నేటికీ అమలు జరగడంలేదని తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యను ప్రైవేటీకరణ కాకుండా ప్రభుత్వాలే ఉన్నత విద్యను ప్రతి ఒక్కరికి ఉచితంగా అందజేయాలని తెలియజేశారు. అందరూ విద్యను అభ్యసించటం ద్వారా సమాజం అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బాలోత్సవ అధ్యక్షులు ఎస్.పి.రామరాజు, రాష్ట్ర బాలోత్సవాల సమన్వయకర్త పి.మురళీకృష్ణ, జి.జ్యోత్స్న, శాతవాహన కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ సాంబిరెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-వన్‌టౌన్: వైయస్సార్ కాలనీకి చెందిన మూడు నెలల చిన్నారి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న విషయం తల్లిదండ్రులు నావీదు, ప్రీతి రాంబాబులు దీవెన ఫౌండేషన్ వారి దష్టికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో దీవెన ఫౌండేషన్ విజయవాడ సిటీ పోలీస్ వారి తరపున రూ. 10 వేలు ఆర్థిక సహాయాన్ని బాబు హాస్పటల్ ఖర్చుల నిమిత్తం ఆదివారం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాచవరం హెడ్ కానిస్టేబుల్ బాబురావు, మహిళా కానిస్టేబుల్ జ్యోతి, సింగినగర్ కానిస్టేబుల్ రాజేష్ హాస్పటల్‌కి వెళ్లి బాబు తల్లిదండ్రులకు అందజేశారు. పేదవారికి, ఆపదలో ఉన్నవారికి సహాయం చేస్తున్న దీవెన ఫౌండేషన్ సభ్యులకు తల్లిదండ్రులు ధన్యవాదములు తెలిపారు.

వైఎస్ఆర్ కాలనీలో చోరీ

ప్రజాశక్తి-వన్‌టౌన్: జక్కంపూడి వైఎస్ఆర్ కాలనీలో తాళం వేసిన ఇంటి తాళం పగులకొట్టి నగలు, నగదు దోచుకుపోయిన సంఘధటనపై ఆదివారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు విజయవాడ జక్కంపూడి వైఎసఆర్ కాలనీ బ్లాకు నెంబర్ 203 జిఎఫ్-2లో కోతాడి మరియమ్మ, సుబ్బారావు కుటుంబం నివసాం వుంటున్నారు. సుబ్బారావు చేపల వ్యాపారం చేస్తుంటాడు. బీసెంట్ రోడ్డులో చేపల మార్కెట్లో చేపలు తెచ్చి, రామవరప్పాడు ఏరియాలో అమ్ముకుంటారు. ఈ నేపథ్యంలో ఆదివారం తెల్లవారుజామున 2.45 గంటలకు ఇంటి తాళం పెట్టి సుబ్బారావు, అతని భార్య పిల్లలతో కలిసి బీసెంట్ రోడ్డుకు వెళ్ళారు. వీరి ఇంటి వద్ద నివసించే శారమ్మ అనే మహిళ సుబ్బారావు కుటుంబానికి ఫోన్ చేసి మీ ఇంటి తలుపులు తీసు ఉన్నట్లు తెలిపింది. వెంటనే వెళ్ళి కటుంబ సభ్యులు ఇంట్లో చూడగా ఇంటి తాళం పగులకొట్టబడి గదిలో వున్న బీరువా లాకర్ పగులకొట్టబడి వుంది. అందులో ఉండాల్సిన బంగారు ఆభరణాలతో పాటు రూ. 50 వేల నగదు కనిపించలేదు. ఇంట్లో అన్ని చోట్లా వెతికినా కనిపించకపోవటంతో గుర్తు తెలియని వ్యక్తులు దోపిడీకి పాల్పడి ఉండవచ్చని అనుమానంతో టూటౌన్ పోలీసులకు బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేత

ప్రజాశక్తి-వన్‌టౌన్: భవానీపురం పరిధిలోని 11 కె.వి. హౌసింగ్ బోర్డు కాలనీ ఫీడర్ లైన్ల మరమ్మతులో భాగంగా సోమవారం ఉదయం 8 గంటల నుండి 10 గంటల వరకు ఎంఐజి-2 బ్లాకులు, పోలీస్ స్టేషన్ రోడ్డు, విఎంసి కళ్యాణ మండపం ఏరియా, హెచ్ఐజి బ్లాకులు, రిలయన్స్ ఫ్రెష్, హెచ్ఆర్‌టి సాయి నిర్మాణ పరిసర ప్రాంతాలు., కోళ్లఫారం రోడ్, మానవమందిర్ రోడ్, అమత అపార్ట్మెంట్ రోడ్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. కె.ఎల్.రావు హెడ్ వాటర్ వర్క్స్ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో 11 కె.వి. కుమ్మరిపాలెం ఫీడర్ మరమ్మతుల కారణంగా కుమ్మరిపాలెం సెంటర్, నాలుగు స్తంబాల సెంటర్, గుప్తా సెంటర్, సాయిబాబా టెంపుల్ సెంటర్, చెరువు సెంటర్, కొండ బడి ఏరియా మరియు సితార సెంటర్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విజయవాడ టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.వి.సుధాకర్ తెలిపారు.

గమయ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్శిటీ: ప్రజాశక్తి నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 'గమయ' చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను రాష్ట్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారుల్లో వచ్చే వివిధ సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స అందించేందుకు విజయవాడ నగరంలో చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. ఇటువంటి సెంటర్లు ఇంకా పెద్ద ఎత్తున రావాల్సిన అవసరం ఉందని తెలిపారు. నగరానికి చెందని ప్రముఖ చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ నోరి సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఈ సెంటర్‌ను నిర్వహిస్తున్నారని తెలిపారు. నగరానికి చెందిన సీనియర్ చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ఆర్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇటీవల కాలంలో చిన్న పిల్లలు అనేక రకాలైన మానసిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, అటువంటి వారికి చక్కటి చికిత్స అందించేందుకు చైల్డ్ డెవపల్‌మెంట్ సెంటర్ ఉపయోగపడుతుందని తెలిపారు. చిన్నారుల్లో జ్ఞాపకశక్తి పెంపొందించే విధంగా ఇక్కడ మానసిక వైద్యులు పూర్తిస్థాయి శిక్షణ ఇస్తారని ఇటువంటి కేంద్రం రాష్ట్రంలోనే తొలిసారిగా విజయవాడ నగరంలో ఏర్పాటు చేశారని అన్నారు. ప్రముఖ పీడియాట్రీషియన్, సెంటర్ నిర్వాహకులు డాక్టర్ కీర్తి మాట్లాడుతూ ఎన్ఐసియు డిశ్చార్జ్డ్, హై రిస్క్ నవజాతి శిశువుల ఫాలోఅప్, సెన్సరీ ఇంటిగ్రేటెడ్ థెరపీ, ఆక్యుపేషన్ థెరపీ, స్పీచ్ లాంగ్వేజ్ థెరపీ, ఎబిఎ థెరపీ, పీడియాట్రిక్ ఫిజియోథెరపీ వంటి సేవలను అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గమయ సెంటర్ డైరెక్టర్లు డాక్టర్ నోరి సూర్యనారాయణ, ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్ నోరి అనురాధ తదితరులు పాల్గొన్నారు.

డైరీ విడుదల

ప్రజాశక్తి-విజయవాడరూరల్: విజయవాడ సమీపంలోని తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ, ఉద్యాన, సహకార, మార్కెటింగ్ శాఖలమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ ఉద్యోగుల సంక్షేమ సంఘం (ఏపీఏఈవో) డైరీని ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో వ్యవసాయ అధికారులు కీలకపాత్ర పోషిస్తున్నారని, రైతులకు వినూత్న సాగు పద్ధతులను సూచిస్తూ మెరుగైన దిగుబడులు వచ్చేలా కృషి చేస్తున్నారన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి వచ్చే ఖరీఫ్ సీజన్ వరకు వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పని చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఏఈవో అధ్యక్షులు బత్తిన రంగనాథ్‌బాబు (విజయవాడ రూరల్), ప్రధాన కార్యదర్శి బి శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి బి సాయిశ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బికెల్లో పురుగు మందులు నిల్

ఉయ్యూరు మండలం బోళ్లపాడులోని రైతుభరోసా కేంద్రం

ప్రజాశక్తి-ఉయ్యూరు

రైతు భరోసా కేంద్రాలు (ఆర్‌బికె)ల్లో పురుగు మందులు అందుబాటులో లేకపోవడంతో షాపుల్లో ఎక్కువ ధరకు కొనలేక రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులకు రాయితీపై పురుగు మందులు, వ్యవసాయ పనిముట్లు, ఎరువులతో పాటు వ్యవసాయానికి కావాల్సిన రైతుభరోసా కేంద్రాల ద్వారా అందజేసి రైతులకు లబ్ధి చేకూర్చాలన్న లక్ష్యంతో రాష్ట్రప్రభుత్వం ప్రతి ఊరిలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటుచేసింది. గత సంవత్సరం రబీ సీజన్లో రైతు భరోసా కేంద్రాల ద్వారా అపరాల సాగునకు పురుగుమందులు సబ్సిడీపై అందజేశారు. ప్రస్తుత రబీ సీజన్లో రైతు భరోసా కేంద్రాల్లో పురుగు మందులు. లేకపోవడంతో మార్కెట్లో రిటైల్ షాపుల దగ్గర అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రకృతి వైపరీత్యాలు, అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోగా నాణ్యతా లోపం సాకుతో కొనుగోలు చేసేందుకు మిల్లర్లు నానా కష్టాలు పెడుతున్నారు. తక్కువ ధరకు అమ్ముకుని రైతులు నష్టపోతున్న పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో రెండో పంట అపరాల సాగుకు అవసరమైన పురుగు మందులు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో లేవు. రైతులకు అది చేస్తున్నాము, ఇదిచేస్తున్నాము, రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎంతో మేలు చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం క్షేత్ర స్థాయిలో అమలు చేయక పోవడం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. రిటైల్ షాపుల్లో అధిక ధరకు కొనాల్సివస్తోంది. రైతు భరోసా కేంద్రాల్లో పురుగు మందులు అందుబాటులో లేకపోవడం వల్ల రిటైల్ షాపుల్లో అధిక ధరకు కొనాల్సివస్తోందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

రైతుల కష్టాలు పట్టించుకోని ప్రభుత్వం

జి.వేణుబాబు, గండిగుంట, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు

గత సంవత్సరం రాయితీపై పురుగు మందులు రైతు భరోసా కేంద్రాల ద్వారా ఇచ్చినట్లే ఈ సీజన్లో కూడా ఇవ్వాలి. లేకపోతే రైతులు బాగా ఇబ్బందులు పడుతున్నారు.

కొనే నాథుడు లేడు

వేమూరు శ్రీనివాసరావు, కాటూరు, రైతు

పండించిన ధాన్యం అకాల వర్షాలకు తడిసి కొనే నాథుడు లేక మిల్లర్లు అడిగిన ధరకు అమ్మి రైతులు నష్టపోతున్నారు. రైతులకు ఎంతో మేలు చేస్తున్నట్టు గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా రబీ సీజన్‌కు రాయితీపై పురుగు మందులు ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నించారు.

పురుగు మందులు రాయితీపై అందజేయాలి

ఎస్.వెంకటనారాయణ, కాటూరు, రైతు

అమ్మపోతే అడవి, కొనబోతే కొరివి అన్న చందాన ప్రస్తుతం రైతుల పరిస్థితి నెలకొంది. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైనవి అన్నీ అందజేస్తున్నామని గొప్పలు చెబుతున్న ప్రభుత్వం చేతల్లో శూన్యంగా ఉంది. ప్రస్తుత రబీ సీజన్‌కు పురుగు మందులు రాయితీపై అందజేయాలి.

ఉన్నతాధికారులు స్పందించాలి

సునీల్, ఏడీఏ, గన్నవరం డివిజన్

ప్రస్తుత రబీ సీజన్లో రైతు భరోసా కేంద్రాల ద్వారా రాయితీపై పురుగుమందులు అందజేయాలన్న రైతుల డిమాండ్ ఉన్నతాధికారుల దష్టికి తీసుకెళ్తాం.

చోడవరంలో ఉచిత మెగా వైద్య శిబిరం

పెనమలూరు : దేవినేని ఆర్మీ, లయన్, ఇంజనీర్ రావి సురేష్ బాబు ఆధ్వర్యంలో పెనమలూరు మండలం చోడవరం గ్రామంలో 114వ ఉచిత మెగా వైద్య శిబిరాన్ని గ్రామంలోని ఎంపీపీ స్కూలు ఆవరణలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ కాకర్ల వెంకటరత్నం, కలపాల శ్రీధర్ పాల్గొని రిబ్బన్ కట్ చేసి ఈ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. 180 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ప్రముఖ కార్పొరేట్ హాస్పిటల్స్ అను గ్రూపు హాస్పిటల్స్, వ రా క ్ర వి ష న్ కంటిహాస్పిటల్, బోన్ అండ్ స్కిన్ సూపర్ స్పెషలిటీ క్లినిక్, వి స్మైలీజ్ హాస్పిటల్ సౌజన్యంతో బీపీ, షుగర్, ఈసీజీ, ఎకో, హార్ట్ చెకప్, ఆర్థోపెడిక్, దృష్టిలోపాలు, దంత సమస్యలు, కీళ నొప్పులు, చర్మ సమస్యలు, జనరల్ చెకప్ చేశారు. 180 మందికి కళ్ళజోళ్ళు, కన్సల్టేషన్ చేశారు. ఈ సందర్భంగా లయన్, ఇంజనీర్ రావి సురేష్ బాబు మాట్లాడుతూ రెండున్నర దశాబ్దాలుగా ప్రజా సేవ తనకి ఎంతో సంతృప్తిని ఇచ్చిందన్నారు. ఎంతో మంది వృద్ధులకు, తల్లి లేదా తండ్రి లేని విద్యార్థులకు కూడా ఆర్థిక సహాయం చేశామన్నారు. ఈ క్రమంలో 5వ తరగతి మండల పరిషత్ పాఠశాలలో చదువుతున్న పంబ పవిత్రకు రూ.2000 ఆర్థిక సహాయాన్ని అందించారు. అనంతరం అన్నదానం చేసి గ్రామంలో మొక్కలు నాటి, హాస్పిటల్ డాక్టర్లు, సిబ్బందికి మొక్కలు అందచేశారు.అమెరికా నుంచి సెలవులకు వచ్చిన చోడవరం గ్రామస్తులైన గోపాలరావు, వారి సతీమణి లక్ష్మి ఈ మెడికల్ క్యాంపు గురించి తెలుసుకొని క్యాంపుని సందర్శించారు. పేదలకు ఉచిత వైద్య సదుపాయాన్ని కల్పించిన రావి సురేష్ బాబుకి అభినందనలు తెలిపారు ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ విజయవాడ రూరల్ ప్రెసిడెంట్ జాస్తి శ్రీనివాసరావు, సెక్రటరీ కోమటి. కిరణ్ కూమార్, దొండపాటి సురేష్, రావి రాజేష్, రావి ప్రవీణ్, కోలవెన్ను మురళి, దేవరపల్లి. వెంకటరావు, మొవ్వ నాగభూషణం, కళతోటి వెంకటేశ్వరరావు, కళతోటి రామకృష్ణ, చాగలమూడి రవిశంకర్, కలపాల శ్రీకాంత్, కరణం మహేంద్ర, మజ్జి సురేష్, వి.రఘు, గ్రామస్తులు, లయన్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - మొవ్వ

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మొవ్వ మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కాశీభొట్ల నారాయణమూర్తి సహకారంతో కూచిపూడి - పెదపూడి వర్తక సంఘ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 120 మందికి పైగా రోగులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 36 మందికి కంటిఆపరేషన్లు అవసరమని గుర్తించారు. మచిలీపట్నం కి చెందిన నాగమణి రెటీనా ఇనిస్టిట్యూట్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆస్పటల్ వైద్యనిపుణులు డాక్టర్ పవన్ కుమార్ గొరిపర్తి వైద్య పరీక్షలు నిర్వహించగా సాంకేతిక నిపుణురాలు పూజ సహకారం అందించారు. ఆపరేషన్ అవసరమని గుర్తించిన వారికి డాక్టర్ వైయస్సార్ ఆరోగ్యశ్రీ, ఈ.హెచ్.ఎస్ పథకం ద్వారా ప్రత్యేక చికిత్స, ఉచిత ఆపరేషన్లను మచిలీపట్నం లోని వైద్యాలయంలో నిర్వహిస్తామని డాక్టర్ పవన్ కుమార్ తెలిపారు. మొవ్వ మండల ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ బెల్లంకొండ వెంకటేశ్వరరావు, సభ్యులు కోనేరు రాజేంద్రప్రసాద్, దోనేపూడి శివరామయ్య, మద్దాల కామేశ్వరరావు, పావులూరు వెంకటేశ్వరరావు ఈ శిబిరంలో సేవలందించారు.

కంటి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

నన్ను చంపే ప్రయత్నం చేశారు : ఎస్‌పికి ఎంపి పిఎ శివ ఫిర్యాదు

మచిలీపట్నం అర్బన్, నాగాయలంక : నన్ను చంపే ప్రయత్నం చేశారని ఎంపి పిఎ గరికపాటి శివ అన్నారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్, కుమారుడు వికాస్, దామోదర్, అనుచరుడు నరసింహారావులపై బందరు ఎంపి బాలశౌరి పిఎ శివ శనివారం జిల్లా ఎస్పీ పి.జాషువాకు ఫిర్యాదు చేశారు. నాగాయలంక మండలం రేమాలవారిపాలెం పంచాయతీలోని మార్కెట్ యార్డ్ ఆవరణలో నాబర్డ చైర్మన్ కె వి షాజి అధ్వర్యంలో డ్వాక్రా సభ్యులకు చెక్కుల పంపిణీ, కె డి సి సి బి నూతన భవన శంకుస్థాపన కార్యక్రమం అనంతరం బందరు ఎంపి వ్యక్తిగత సహాయకుడు శివపై ఎమ్మెల్యే రమేష్ బాబు, కుమారుడు, మేనల్లుడు, అనుచరులు దాడి చేసిన విషయం విధితమే. ఎస్పీకి ఫిర్యాదు చేసిన అనంతరం బాధితుడు శివ మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్యే రమేష్ బాబు కుటుంబంతో తనకు ప్రాణహాని ఉందన్నారు. పక్కా పథకం ప్రకారమే తనపై దాడి చేశారని ఆరోపించారు. బందరు ఎంపీ, నాబార్డ్ చైర్మన్ ముందరే దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గత మూడు నెలలుగా ఫోన్లో బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. దాడి ఘటనలో పోలీసుల హస్తం కూడా ఉందని ఆరోపించారు. అవనిగడ్డ సీఐ శ్రీనివాస్ నిలువరించారని లేకుంటే చంపే ప్రయత్నం చేశారన్నారు. తాను కుటుంబమంతా సిఎం జగన్ అభిమానులమని తెలిపారు. తనకు ప్రాణ రక్షణ కల్పించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

మాట్లాడుతున్న గరికపాటి శివ

ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలి

చల్లపల్లి : ఉద్యోగులు తమ ఆత్మ గౌరవం, హక్కులను కాపాడుకోవటంతో పాటు సామాజిక బాధ్యత గల సంఘ నేతలుగా సమాజంలో మన్ననలు పొందాలని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్‌బాబు కోరారు. అసోసియేషన్ కృష్ణాజిల్లా సమావేశం చల్లపల్లిలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సేవా సదన్‌లో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో సంఘ మచిలీపట్నం డివిజన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. సురేష్ బాబు మాట్లాడారు. ఈ సమావేశంలో బందరు డివిజన్‌కి అసోసియేషన్ అధ్యక్షులుగా లైబ్రరీ ఉద్యోగి ఎస్.చినరాజు, ప్రధాన కార్యదర్శిగా రెవిన్యూ ఉద్యోగి కిరణ్, మహిళా కార్యదర్శిగా సిహెచ్.రాణి, ఉపాధ్యక్షులుగా జి.ఆంజనేయులు, సంయుక్త కార్యదర్శి గా సిహెచ్.సరళ,కార్యదర్శిగా కె. సుబ్రమణ్యేశ్వరిని ఎన్నుకున్నారు.

నూతన కమిటీతో దేవరపల్లి సురేష్‌బాబు

వేగంగా రోడ్లు, భవనాల నిర్మాణాలు

పమిడిముక్కల పంచాయతీరాజ్ ఎఇ షరాబందిరాజు

ప్రజాశక్తి-పమిడిముక్కల

పమిడిముక్కల మండలంలో రోడ్ల ఆధునీకరణ, నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని పమిడిముక్కల పంచాయతీరాజ్ ఎఇ షరాబందీరాజు చెప్పారు. ఆయన ప్రజాశక్తికి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. మండలంలో పంచాయతీరాజ్ విభాగం ద్వారా రోడ్ల నిర్మాణ పనులు అత్యంత వేగవంతంగా జరుగుతున్నాయని చెప్పారు. ఎన్‌ఆర్‌ఇజిఎస్ నిధులతో రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా వైఎస్సార్ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణానికి రాష్ట్రప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మర్రివాడ, మంటాడ, లంకపల్లి, పమిడిముక్కల గ్రామాల్లోని లేఔట్లకు రోడ్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మర్రివాడ, అగినపర్రులో సచివాలయం నిర్మాణాలు పూర్తయ్యాయని చెప్పారు. పమిడిముక్కల సచివాలయ నిర్మాణానికి రూ.40 లక్షలు, రైతు భరోసా కేంద్రానికి రూ.17 లక్షలు, ఆరోగ్య కేంద్రం ఉపకేంద్రం నిర్మాణాలకు రూ.14 లక్షలు మంజూరయ్యాయన్నారు. పామర్రు శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ సహాయ సహకారాలతో పమిడిముక్కల మండలంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. పమిడిముక్కల జెడ్పీటీసీ సభ్యురాలు యేనుగు వెంకటరమణ కుమారి ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ నిధులతో పనులు చేపడుతున్నామన్నారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతులు, ఇతర అభివృద్ధి పనులు, మౌలిక వసతులకు ప్రాధాన్యత ఇస్తున్నామని వివరించారు. గన్నవరం మండల పరిషత్ అధ్యక్షురాలు కాసాని వేద సుప్రజ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీల సహాయ సహకారాలతో పనులు చేపడుతున్నామని తెలిపారు. ప్రభుత్వం నుండి బిల్లులు సకాలంలో మంజూరయ్యేలా కృషిచేస్తామని తెలిపారు. జిల్లా పరిషత్ నిధులతో కూడా పనులు చేపడుతున్నామని వివరించారు.

నేడు 'గాంధీ మార్గం' గ్రంథావిష్కరణ సభ

అవనిగడ్డ : సోమవారం గాంధీ క్షేత్రంలో నాలుగు గంటలకు జరిగే వర్ధంతి సభలో గాంధీ మార్గం గ్రంధాన్ని ఆవిష్కరించనున్నట్లు గాంధీ క్షేత్రం కమిటీ తెలిపింది. ఈ పుస్తకాన్ని అమెరికాలోని డోలాస్ నగరంలో గాంధీ మెమోరియల్ చైర్మన్ డాక్టర్ తోటకూర ప్రసాద్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్, గాంధీయ మార్గం సంపాదకులు డాక్టర్ నాగునూరి వేణు గోపాల్ పాల్గొంటారని పేర్కొన్నారు.

నేడు విద్యార్థులకు పోటీలు

అవనిగడ్డ : అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో గాంధీ 75వ వర్ధంతి సభతోపాటుగా నియోజకవర్గ స్థాయిలో విద్యార్థులకు ప్రతిభాపాటవ పోటీలు గాంధీ క్షేత్రం అభివృద్ధి కమిటీ, గ్రామీణ యువజన వికాస సమితి, దివిసీమ లలిత కళా సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆయా సంఘాల ప్రతినిధులు తెలిపారు. గాంధీ జీవితంపై వ్యాసరచన పోటీ సోమవారం ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు, చిత్రలేఖనం 11 నుండి 12 గంటల వరకు ఉంటుందని వివరించారు. ఎనిమిదో తరగతి నుంచి డిగ్రీ వరకు చదివే విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు.

రెండో అధికార భాషగా ఉర్దూ

పలువురు వక్తలు

సదస్సులో మాట్లాడుతున్న వక్తలు

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఉర్దూ భాషను రెండవ అధికార భాషగా గుర్తించి, పెద్ద పీట వేసిందని మైనారిటీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎ.ఎం.డి.ఇంతియాజ్ అన్నారు. ఆల్ మునీర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మొగల్‌రాజపురంలోని మోడరల్ పబ్లిక్ స్కూల్లో నేషనల్ ఉర్దూ సెమినార్ జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న ఇంతియాజ్ మాట్లాడుతూ ఉర్దూ పరిరక్షణకు భాషాభిమానులు తమ కర్తవ్యకంగా భావించి మరింత బలోపేతానికి కృషజ చేయాలన్నారు. ఉర్దూ అధ్యాపకుల ద్వారా సమాజంలో మార్పు వస్తుందని అన్నారు. విద్యార్థులను ఉత్తములుగా ఎదిగేందుకు గురువులు ఎంతో కష్టపడతారని ఈసందర్భంగా గురువులను అభినందించారు. విద్యారంగాన్ని బలోపేతం చేయడం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని, కోట్ల రూపాయలు వెచ్చిస్తుందన్నారు. ఆల్ మునీర్ ఫౌండేషన్ చైర్మన్ మునీర్ అహ్మద్ మాట్లాడుతూ విద్య ద్వారా సమజాం అభివృద్ధి చెందుతుందని అందుకు ముస్లిం సమాజం తమ పిల్లలను తప్పకుండా ఉన్నత విద్యను చదివించాలన్నారు. ఉన్నత విద్యను అభ్యసించడం ద్వారా ఆర్థిక అసమానతలు తొలగుతాయని తెలిపారు. విద్య కొరకు ఆర్థిరక సాయం అందించేందకు మునీర్ ఫౌండేషన్ సిద్దంగా ఉందన్నారు. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు మోడరన్ స్కూల్ తరపున స్కాలర్‌షిప్‌లను అందిస్తున్నామని తెలిపారు. ఉర్దూ అకాడమి సెక్రటరీ సయ్యద్ అయ్యుబ్ అహ్మద్, ఉర్దూ భాష అభివృద్ధి కొరకు వ్రాత పూర్వకమైన పలు సూచనలు సలహాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ హిదయతుల్లాహ్, మోడరన్ పబ్లిక్ స్కూల్ అధినేత మోహమ్మద్ యూనుస్ పాల్గొన్నారు.

కౌలురైతు సంఘం కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-చందర్లపాడు: కౌలు రైతుల సంఘం 2023 కేలండర్‌ను మండలంలోని తోటరావులపాడు గ్రామ సర్పంచ్ ములకలపల్లి లక్ష్మి ఆదివారం ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే కాలంలో రైతాంగ సమస్యలపై మరింత సమర్ధవంతంగా పోరాడుతూ కౌలు రైతుల సంఘం అభివృద్ధి చెందాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు ములకలపల్లి కృష్ణమోహన్, కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు, రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం వెంకటరెడ్డి, పీవీ ఆంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సయ్యద్ కాసిం, నీటి సంఘం నాయకులు యక్కండి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి : సిఐ

ప్రజాశక్తి-కంచికచర్ల: ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాపాయం నుండి బయటపడేందుకు ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా

హెల్మెట్ ధరించాలని నందిగామ రూరల్ సిఐ ఐవి నాగేంద్రకుమార్ అన్నారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండల పరిధిలోని పరిటాల సమీపంలో బైపాస్ అండర్ పాస్ వద్ద ద్విచక్ర వాహనదారులకు ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనం నడపడం వల్ల విచక్షణ కోల్పోయి డ్రైవింగ్‌పై పట్టుకోల్పోతారన్నారు. మద్యం సేవించి వాహనం నడుపుతూ ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పయి చాలా కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడితే, వాహనం సీజ్ చేయటంతో పాటు, కేసు నమోదు చేసి జైలుకు పంపుతామన్నారు. వాహనం నడిపే సమయంలో ట్రాఫిక్ నియమాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పివియస్ సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

సిపిఎస్ రద్దు చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని టీచర్స్ కో-ఆపరేటివ్ సొసైటీ కార్యాలయంలో ఆదివారం యుటిఎఫ్ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.కృష్ణయ్య అధ్యక్షతన సిపిఎస్ అంశంపై యుటిఎఫ్ ప్రాంతీయ

సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు కుక్కడపు శ్రీనివాసరావు మాట్లాడుతూ రిటైర్మెంట్ అనంతరం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆర్థిక, సామాజిక భద్రత కలిగించలేని, లోపభూయిష్టంగా ఉన్న సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఉపాధ్యాయులు ఎం.పరమేశ్వరరావు సౌజన్యంతో ముద్రించిన యుటిఎఫ్ పాకెట్ డైరీలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పులి శ్రీనివాసరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు యల్.వి.సత్యనారాయణ, జె.సుధానంద్, జి పల్లవి, షేక్ ఫైమర్ సాహెబ్, జగ్గయ్యపేట, వత్సవాయి, పెనుగంచిప్రోలు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి ప్రవీణ్ కుమార్, అల్లిక నరసింహారావు, పెసరమల్లి వెంకటేశ్వర్లు, డి సైదులు, ఎం.డి.జిలాని పాల్గొన్నారు.

హెల్మెట్ వాడకంపై అవగాహన

ప్రజాశక్తి-తిరువూరు: హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని తిరువూరు-1 ఎస్ఐ దుర్గాప్రసాద్ వాహనదారులకు విజ్ఞప్తి చేశారు.

స్థానిక అయ్యప్పస్వామి దేవాలయం సెంటర్‌లో హెల్మెట్ వాడకంపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కువ శాతం రోడ్డు ప్రమాదాల్లో తలకు గాయాలవ్వడం వల్ల మరణాలు సంభవిస్తున్నాయని, హెల్మెట్ ధరిస్తే ప్రాణాపాయం నుండి తప్పించుకోవచ్చన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్, ధ్రువపత్రాలు కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్-2 ఎస్ఐ పద్మారావు, ఎఎస్ఐ కృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్వా డెవిల్స్‌లో మౌలిక వసతుల కల్పనకు కృషి

ప్రజాశక్తి-హెల్త్‌యూనివర్శిటీ: ఆక్వా డెవిల్స్‌కు మౌళిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షులు వెలగపూడి వెంకటేశ్వరరావు అన్నారు. కృష్ణానది ఒడ్డున గల ఆక్వా డెవిల్స్ ప్రాంగణంలో ఆదివారం ఆక్వా డెవిల్స్ సభ్యుల సర్వసభ్య సమావేశం లైఫ్ చైర్మన్ గోకరాజు గంగరాజు అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. నూతన అధ్యక్షునిగా వెలగపూడి వెంకటేశ్వరావు, కార్యదర్శిగా మందపాటి లక్ష్మీ నరసరాజు, ఉపాధ్యక్షులుగా లింగిపల్లి రామకృష్ణ, కోశాధికారిగా వీసం వెంకట సుబ్బారావు, సహాయ కార్యదర్శిగా డాక్టర్ ఓబుల్‌రెడ్డి, కమిటీ సభ్యులుగా గోపాళం సాంబశివరావు, సిహెచ్ ఎల్. నరసింహారావు, కర్రి సాంబయ్య, సురేష్ కుమార్, వడిపిన రాము, పి.ప్రభాకర్, కె.వి.రామయ్య, టి. ఉమామహేశ్వర రెడ్డి, ఎన్.వి.కృష్ణమూర్తి, అమ్మిరెడ్డి రామిరెడ్డి, పులిపాటి నివాసరావు, వై.శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

హైవే సరిహద్దు గోడ సమస్యపై కలెక్టర్‌ను కలిసిన రైతులు

ప్రజాశక్తి-విజయవాడరూరల్: చినఅవుటుపల్లి-గొల్లపూడి నేషనల్ హైవేకి సరిహద్దు గోడలు నిర్మించవద్దని విజయవాడ రూరల్ మండలానికి చెందిన రైతులు ఆదివారం కలెక్టర్ ను కలిశారు. నేషనల్ హైవే కాంట్రాక్ట్ సంస్థ గ్రామాల వద్ద రోడ్డుకు 30 అడుగులు వదిలి సరిహద్దు గోడల నిర్మాణానికి గడ్డర్లు పాతుతుండగా సమీప గ్రామాల రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. రైతులు పండించిన వ్యవసాయోత్పత్తులు తీసుకెళ్లేందుకు రహదారి సదుపాయం లేకుండా మూసివేస్తున్నారని వారు కలెక్టర్‌కు వివరించారు. జాతీయ రహదారికి సర్వీసు రోడ్డు ఉంటుందని చెబితే భూములు ఇచ్చామన్నారు. రైతులకు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో రూరల్ మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్ర్యారెడ్డి నాగిరెడ్డి, సొసైటీల చైర్మన్‌లు పొలారెడ్డి చంద్రారెడ్డి, రవీంద్రారెడ్డి, సర్పంచ్‌లు సోమయ్య, సీతయ్య, నున్న, పాతపాడు, కంద్రిక, నైనవరం, అంబాపురం గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు. అలాగే రూరల్ మండలంలో ప్రధాన గ్రామమైన నున్నలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, టిటిడి కళ్యాణ మండపం నిర్మాణాలకు స్థలం కేటాయించాలని నాగిరెడ్డి, చంద్రారెడ్డి, ముత్తారెడ్డి కోరారు.

మూలపాడులో సిద్ధార్థ విద్యార్థుల ట్రెక్కింగ్

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల యోగ విభాగం ఆధ్వర్యంలో ప్రజా చైతన్య కార్యక్రమంలో భాగంగా మూలపాడు ట్రెక్కింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ కళాశాలకు చెందిన యోగా డిప్లమో, బికాం, బిసిఎ, బిబిఎ మొదలైన కోర్సుల విద్యార్థులు, జాతీయ సేవా పథకం వాలంటీర్లు పాల్గొన్నారు. యోగా ట్రైనర్ డి.రవికిరణ్ యోగాసనాలు యొక్క ప్రయోజనాలను, సాధన చేసేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. యోగ డిప్లమో కోర్సు విద్యార్థులు ఆసనాలు వేస్తుండగా ఒక్కొక్క యోగాసనంలోని ప్రత్యేకతను రవికిరణ్ వివరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం సమన్వయకర్త పెదపూడి శుభాకర్ పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మేక రమేష్, డైరెక్టర్ వేమూరి బాబురావు, డీన్ రాజేష్ జంపాల విద్యార్థులను అభినందించారు.

ఏషియన్ షూటింగ్ జట్టుకు నగర క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: ఒకటో తేదీ నుంచి యూపీలోని ఘజియాబాద్లో షూటింగ్ బాల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే మొదటి ఏషియన్ షూటింగ్ బాల్ చాంపియన్షిప్ పోటీలకు కృష్ణాజిల్లా నుంచి ముగ్గురు క్రీడాకారులు ఎంపికయినట్లు కృష్ణాజిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు అట్లూరి రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశం గర్వించదగ్గ ఏషియన్ చాంపియన్ షిప్‌కు నగరం నుంచి గోగులమూడి విజయ్ కుమార్, పొన్నాడ హనీత్ నాగ్, మల్లవరపు శివఆంజనేయులు ఎంపికయినట్లు తెలిపారు. జాతీయస్థాయి టోర్నీలో అత్యుత్తమ ప్రతిభ కనబరచడం ద్వారా షూటింగ్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన తుది జాబితాలో ఈ ముగ్గురు క్రీడాకారులు చోటు

దక్కించుకున్నారన్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో ఈ క్రీడను అభివద్ధి చేశామన్నారు. ఈ సమావేశంలో కృష్ణాజిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు వెంకట్రావు, జిల్లా లీగల్ అడ్వైజర్ కొక్కిరిగడ్డ స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని డిపో సెంటర్ సామినేని విశ్వనాథం కార్మిక నగర్‌లో జగ్గయ్యపేట కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ నూతన కార్యాలయ భవనాన్ని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ జగ్గయ్యపేట పట్టణంలో ఉన్న 60 మెడికల్ దుకాణాలు వారు ఉమ్మడిగా ఏర్పడి ఒక కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోవడం సంతోషదాయకమన్నారు. దాదాపు 11 సంఘాల వారికి ఇక్కడే స్థలాలను కేటాయించి భవనాలు ఏర్పాటు చేసుకోవడం జరిగిందని తెలిపారు. మెడికల్ అసోసియేషన్ వారు మూడు నెలలకు ఒకసారి మెడికల్ క్యాంపులు నిర్వహించి ఉచితంగా మందులు అందించేలా తమవంతుగా సహకారాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కెడిసిసి బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, పట్టణ అధ్యక్షులు ఆకుల శ్రీకాంత్ (బాజీ), నాయకులు ఫిరోజ్ ఖాన్, వట్టెం మనోహర్, కాశీ కిషోర్, కో ఆప్షన్ ఖాదర్ బాబు, రిటైర్డ్ ఎన్ఎస్‌పి సైదా, మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కీసర రాంబాబు, సెక్రటరీ పందిటి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దీక్షితకు ఎంఎల్ఎ అభినందన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణానికి చెందిన రాంకో ఉద్యోగి బండి రామాంజనేయులు కుమార్తె బండి దీక్షిత సాయి ఈ నెల 23వ తేదీన శ్రీకాకుళంలో జరిగిన 66వ ఆంధ్రప్రదేశ్ ఇంటర్ డిస్టిక్ స్టేట్ అథ్లెటిక్స్ ఛాంపియన్స్ 2023లో హార్డిల్స్ 80 మీటర్లలో 3వ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా ఆదివారం రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ఆయన స్వగృహంలో బండి దీక్షిత సాయిని అభినందించారు.

నైట్ సర్వీస్‌ల ఏర్పాటుకు కృషి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద గల నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం ఎన్ఎంయుఎ, ఇయు కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉదయభానుకు వినతిపత్రాలు అందజేశాయి. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ జగ్గయ్యపేట డిపో నుండి దూరప్రాంతాల సర్వీసుల పెంపుకు, హైదరాబాదు నుండి జగ్గయ్యపేటకు నైట్ సర్వీస్ ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఒటి అలవెన్స్, నైట్ అవుట్‌లో అలవెన్స్, మస్టర్ల కొరకు అధికారులతో చర్చించి సానుకూలంగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

జయలక్ష్మి ఇంజినీరింగ్ వ్యాపారంలో రాణించాలి : కొడాలి నాని

ప్రజాశక్తి-గుడివాడ

జయలక్ష్మి ఇంజనీరింగ్ వర్క్స్ అధినేత అల్లం

కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న కొడాలి నాని

రామోహనరావు ఆధ్వర్యంలో ముద్రించిన 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను వైసిపి నాయకులతో కలిసి స్థానిక కాకర్లవీధిలోని అల్లం రామోహనరావు స్వగృహంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామోహనరావు వ్యాపారంలో మరింత అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, నాయకులు మదాసు వెంకటలక్ష్మి, అల్లం సూర్యప్రభ, పాలేటి చంటి, వెంపటి సైమన్, అంజనేయప్రసాద్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పీతల వ్యాపారులకు కిసాన్ క్రెడిట్ రుణాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి-నాగాయలంక

పీతల వ్యాపారులకు కిసాన్ క్రెడిట్ రుణాలు మంజూరుచేయాలని ఎపి సంప్రదాయ మత్స్యకారుల సేవా సంఘం ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నాగాయలంకలో జరిగిన పీతల వ్యాపారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల ఉపాధి కోసం పీతల కల్చర్‌ను ప్రభుత్వం ప్రోత్సహించాలని కోరారు. వ్యాధులు భారిన పడకుండా తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వచ్చేపీతలకు సరైన మార్కెటింగ్ కూడా కల్పించాలని కోరారు. వ్యాపారాభివృద్ధి కోసం కిసాన్ క్రెడిట్ కార్డులు అందించి రుణ సదుపాయం కల్పించాలన్నారు. రాష్ట్ర పీతల వర్తక సంఘం మాజీ అధ్యక్షుడు రేవు సువర్ణరాజు మాట్లాడుతూ గన్నవరం విమానాశ్రయం నుంచి సింగపూర్‌కు నేరుగా పీతలు ఎగుమతి జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గిట్టుబాటు ధరలు, వ్యాపార లావాదేవీలు సక్రమంగా జరిగేందుకు వీలుగా ప్రత్యేక ఏజెన్సీని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యాపారస్తులు, పలువురు రైతులు, పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు లయన్స్ క్లబ్ సాయం

ప్రజాశక్తి-చల్లపల్లి

చల్లపల్లి మండలం వెలివోలులో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బొల్లా శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు చల్లపల్లి లయన్స్ క్లబ్ ఆదివారం సాయమందించింది. క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ శ్రీశాంతి బాధిత కుటుంబానికి బీరువా, మంచం, కుటుంబ సభ్యులకు నూతన దుస్తులను అందచేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు ఏఎల్ ఆర్కే.ప్రసాద్, నర్రా సాయిబాబు, కోశాధికారి ముమ్మనేని నాని, క్లబ్ ప్రతినిధులు టి.సాంబశివరావు, కస్తూరి ప్రసాద్, వరదా హరగోపాల్, రాయపాటి రాధాకష్ణ, ఎంవి.కష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న క్లబ్ ప్రతినిధులు

ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలి

కృష్ణాజిల్లా పరిషత్ ఎంప్లాయీస్ కోఆపరేటివ్ సొసైటీ సభ్యులు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

పారదర్శకంగా, ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా ప్రజాస్వామ్య పద్ధతిలో కృష్ణాజిల్లా పరిషత్ ఎంప్లాయీస్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ఎన్నికలు నిర్వహించాలని సభ్యులు దారపు.శ్రీనివాస్,ఆర్. హేమ ప్రకాష్ డిమాండ్

మాట్లాడుతున్న సొసైటీ సభ్యులు

చేశారు. ఆదివారం స్థానిక ఎన్జీవో హోంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. సొసైటీ ప్రస్తుత పాలక వర్గ గడువు 2022 డిసెంబర్‌తో ముగిసిందన్నారు. పాలకవర్గ సభ్యులు సంబంధిత అధికారులను కలిసి మరో ఆరు నెలలు పదవీ కాలాన్ని పొడిగించాలని విజ్ఞప్తి చేశారన్నారు. వారి విజ్ఞప్తి మేరకు మూడు నెలలకు పాలకవర్గ కాల పరిమితి పొడిగిస్తూ జిల్లా సహకార అధికారులు ఉత్తర్వులు ఇచ్చారని వివరించారు. ఈలోగానే ప్రస్తుత పాలక వర్గ సభ్యులు నిబంధనలకు విరుద్ధంగా ఎన్నికలు నిర్వహించడానికి చర్యలు చేపట్టారన్నారు. ఈ నేపథ్యంలోనే అనర్హులను ఓటర్లుగా చేర్పించడం, అర్హులను తొలగించి ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ఓటర్ల జాబితా ప్రచురించారన్నారు. ఓటర్ల జాబితాలో తప్పొప్పులను సరి చేసి ప్రచురించిన తర్వాత ఎలక్షన్ నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా ఎలక్షన్ ఆఫీసర్ వ్యవహరించారని ఆరోపించారు. గత మూడు పర్యాయాలుగా ఒకే వ్యక్తి ఎలక్షన్ ఆఫీసర్‌గా వ్యవహరించడం వల్లే ఎన్నికల్లో నియమావళికి విరుద్ధంగా అక్రమాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. జరుగుతున్న అక్రమాల పట్ల జిల్లా కోపరేటివ్ అధికారికి గత 20 రోజుల క్రితం ఫిర్యాదు చేశామన్నారు. అయినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఎన్నికల నియమావళిలో జరుగుతున్న అవకతవకలు సరిచేసి పూర్తి పారదర్శకంగా చట్టబద్ధంగా ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నిక జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సొసైటీ భవన నిర్మాణంలో సుమారు రూ.25 లక్షలు వరకు దుర్వినియోగం జరిగినట్లు ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి శాఖాపరమైన విచారణ నిర్వహించి ప్రజాస్వామ్య బద్ధంగా అర్హులైన వారిచే సక్రమమైన రీతిలో ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.వీటిపై సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేయనున్నామని స్పష్టంచేశారు. ఈ సమావేశంలో సభ్యులు ఎ.జె.జయకర్, బి.శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

కొండాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం అధిక

నైవేద్యం తయారుచేస్తున్న మహిళలు

సంఖ్యలో యాత్రికులు దర్శనం చేసుకున్నట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి కానూరి సురేష్ బాబు తెలిపారు. సుమారు 10 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకొని పాల పొంగళ్ళు సమర్పించి మొక్కుబడులను తీర్చుకున్నారని పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు పరిశీలించినట్లు తెలిపారు.

అహంకారంతో ప్రవర్తించి మాపై నిందలా? : టిడిపి

ప్రజాశక్తి-అవనిగడ్డ

నాగాయలంకలో శనివారం ఎంపీ గ్రూపునకు చెందిన వారిపై అహంకారంతో దాడికి పాల్పడిన ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు తమ తప్పును కప్పిపుచ్చుకునేందుకు టిడిపి వారి వల్లనే గొడవ జరిగిందంటూ తప్పించుకునే ప్రయత్నం చేయడం సిగ్గుచేటని అవనిగడ్డ నియోజకవర్గ టిడిపి నాయకులు విమర్శించారు. ఆదివారం పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దివి మార్కెట్ కమిటీ ఆవరణలో ఎమ్మెల్యే తమ అనుచరులతో కలిసి ఎంపీ అనుయాయులపై దాడికి పాల్పడడం యావత్ ప్రపంచం చూసిందన్నారు. జరిగిన తప్పుకు పశ్చాత్తాప పడకుండా తమకు గ్రూపులు లేవనీ, తెలుగుదేశం పార్టీ వారి కారణంగానే సమస్య ఏర్పడిందంటూ ఎమ్మెల్యే అర్థంలేని వాదనను తెరపైకి తీసుకొని రావడం విడ్డూరంగా ఉందన్నారు బందరు ఎంపీ బాలశౌరి పట్ల వ్యవహరిస్తున్న తీరు అందరికీ తెలిసిందేనన్నారు. ఇటీవల జరిగిన ముఖ్యమంత్రి పర్యటనలో బ్యానర్లు కట్టే విషయంలో ఏర్పడిన వివాదం సమయంలో ఏమి జరిగిందో అందరికీ తెలుసునన్నారు. నాడు జరిగిన తప్పును కప్పిపుచ్చుకునేందుకే ఎమ్మెల్యే ఇలా దిగజారుడు రాజకీయాలు చేయడం సిగ్గుచేటన్నారు. తాము క్రమశిక్షణ కలిగిన మానవతావాది మండలి బుద్ధ ప్రసాద్ నేతృత్వంలో పనిచేస్తున్న కార్యకర్తలమని చెప్పారు. తమకు ఎవరి అవసరం లేదని తాము ఎప్పటికీ తెలుగుదేశంలోనే ఉంటామన్నారు. ఎలాంటి తప్పుడు పనులు చేయాల్సిన అవసరం తనకు లేదని అన్నారు అదేవిధంగా గొడవను చిత్రీకరిస్తున్న

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

మీడియా వారితో దురుసుగా ప్రవర్తించారని ఇలా ప్రవర్తించడం ఎమ్మెల్యేకు కొత్త కాదన్నారు. గతంలో అనేక పర్యాయాలు మీడియాపై దురుసుగా ప్రవర్తించిన విషయం దివిసీమ ప్రజలకు తెలుసునన్నారు. అధికారంలో ఉన్నామనీ విర్ర వీగితే ప్రజలే బుద్ధి చెబుతారని విషయాన్ని గుర్తించాలని హితవు పలికారు. ఈ సమావేశంలో అవనిగడ్డ మండల టిడిపి అధ్యక్షులు యాసం చిట్టిబాబు, జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, మండల పార్టీ కార్యదర్శి కర్ర సుధాకర్, బండే రాఘవ, ఘంటసాల రాజమోహనరావు, పులిగడ్డ నాంచారయ్య, చెన్ను గాంధీ, లింగం బాబూరావు, మెగావత్ గోపి, మొగల్ మురాద్, ఆనగడ్డ ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

వేటూరికి ఘన నివాళి

ప్రజాశక్తి-అవనిగడ్డ

సినీ గేయ రచయిత కీర్తిశేషులు వేటూరి సుందర రామమూర్తి 87వ జయంతి వేడుకలు ఆదివారం అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేటూరి

వేటూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

చిత్రపటానికి పలువురు ప్రముఖులు పూలదండలు వేసి నివాళు లర్పించారు. వేటూరి 1936 జనవరి 29వ తేదీన పెదకళ్ళేపల్లి గ్రామంలో జన్మించారన్నారు. ఆయన తెలుగు సినీ పాటల రంగంలోకి ప్రవేశించి పుట్టిన గ్రామానికి ఎంతో పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చారని కొనియాడారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కొల్లూరి వెంకటేశ్వరరావు, యాసం చిట్టిబాబు, కర్ర సుధాకర్ బండే రాఘవ, ఘంటసాల రాజమోహనరావు, పులిగడ్డ నాంచారయ్య, గుంటూరు వినయ్, చెన్ను గాంధీ, గోపి, లింగం బాబూరావు, మొగల్ మురాద్, మెగావత్ గోపి, కోట సాయి, అవనిగడ్డ ప్రకాశం, చెన్ను బుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బండి రామకృష్ణ ఆర్థిక చేయూత

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

మచిలీపట్నం కార్పొరేషన్ పరిధిలోని కొత్తపేటకు చెందిన చెన్ను నరేంద్రబాబు చక్కెర వ్యాధి కారణంగా కిడ్నీలు పనితీరు మందగించడంతో డయాలసిస్‌తో వైద్యం

నగదును అందజేస్తున్న బండి రామకృష్ణ

అందించాల్సివస్తోందని జనసేన పార్టీ మచిలీపట్నం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండి రామకృష్ణ అన్నారు. చిన్న వయసులోనే ఇలాంటి అనారోగ్య పరిస్థితి రావడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. బాధితునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారని తెలిపారు. తన వంతు సాయంగా రూ.5000, చలమలశెట్టి బాలాజీ(ఎన్ఆర్ఐ) రూ.5,000 విలువైన నిత్యావసర సరుకులు, ప్రతినెలా ఇంటి అద్దెను బాలాజీ ఇస్తున్నారని తెలిపారు. స్వచ్ఛంద సంస్థలు, మానవతావాదులు నరేంద్రబాబు కుటుంబానికి తమ వంతు సాయం అందించి ఆదుకోవాలని బండి రామకృష్ణ పిలుపునిచ్చారు. బాధిత కుటుంబ సభ్యులు మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తమకు అండగా ఉన్న మచిలీపట్నం జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణ, ఎన్నారై చలమలశెట్టి బాలాజీకి జనసేన పార్టీ కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డం రాజు, తోట రాజేష్, నరసింహ, చక్రి, మైఖేల్, రామ్ జ్యోతి, వడ్డీ చిరంజీవి,విన్నకోట శ్రీకాంత్, బాధిత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకాష్, కృష్ణల మృతికి టిడిపి సంతాపం

గుడివాడ : గుడివాడ నియోజకవర్గంలో ఆదివారం మృతి చెందిన టిడిపి నాయకుల మృత దేహాలను మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు సందర్శించారు. భౌతికాయాలపై పూలమాలలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు. పట్టణంలోని 15వ వార్డు గుడ్‌మెన్‌పేటలోని టిడిపి కార్యకర్త మైలవరపు ప్రకాష్ మృతి చెందడంతో స్థానిక టిడిపి నాయకులు కంచర్ల సుధాకర్, ఇతర నాయకులతో కలిసి రావి వెంకటేశ్వరరావు భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. నందివాడ మండలంలోని తమిరిశ గ్రామ సీనియర్ టిడిపి నాయకులు, మాజీ బ్యాంక్ డైరెక్టర్ బండారు కృష్ణ మృతి చెందగా ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళు లర్పించారు. ఆయా కుటుంబ సభ్యులను పరామర్శించి రావి వెంకటేశ్వరరావు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

'కృష్ణా'లోకి సమరయాత్ర

చల్లపల్లిలో ఘన స్వాగతం

ప్రత్యేక హోదా, విభజన హామీలుపై కేంద్ర వైఖరిని ఎండగట్టిన నేతలు

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి, చల్లపల్లి

రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోరుతూ యువజన, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకు చేపట్టిన ప్రత్యేక హోదా, విభజన హామీలు సాధన సమర యాత్ర ప్రచార జాతా ఆదివారం కృష్ణాజిల్లాలోకి ప్రవేశించింది. పులిగడ్డ- పెనుమూడి వారధి మీదుగా కృష్ణాజిల్లాలోకి ప్రవేశించి అవనిగడ్డ నియోజకవర్గంలోని పులిగడ్డ, మోపిదేవి మీదుగా చల్లపల్లికి చేరింది. సిపిఎం, సిపిఐ, ప్రజాసంఘాల నాయకులు చల్లపల్లి వద్ద సమర యాత్రకు ఘనస్వాగతం పలికారు. ఈసందర్భంగా చల్లపల్లి సెంటర్లో జరిగిన సభలో డివైఎఫ్ఐ, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు జి.రామన్న, లెనిన్‌బాబులు మాట్లాడుతూ విభజన హామీలను అమలు చేయకుండా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు తీరని ద్రోహం చేస్తోందని విమర్శించారు. ప్రత్యేక హోదా ఇస్తేనే రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్రంలో వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు కేంద్రం బుందేల్‌ఖండ్ తరహాలో రూ. 25 వేల కోట్లు ప్యాకేజీ ఇవ్వాల్సి ఉందని, కేవలం రూ.1050 కోట్లు ఇచ్చి చేతులు దులుపుకోవడంతో ఈ రెండు ప్రాంతాల్లో అభివృద్ధి కుంటుపడిందని ఆందోళన వ్యక్తం చేశారు. షెడ్యూల్ 13 ప్రకారం సెయిల్ ఆధ్వర్యంలో కడపలో ప్రభుత్వ రంగంలో నిర్మించాల్సిన ఉక్కు ఫ్యాక్టరీని కేంద్రం అడ్డుకుంటోందన్నారు. ప్రభుత్వరంగంలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే లక్షల మందికి ఉపాధి దొరుకుతుందన్నారు. ప్రయివేటు సంస్థలు ఫ్యాక్టరీ ఏర్పాటు చేసినా అనుకున్న స్థాయిలో ఉపాధి అవకాశాలు ఉండవన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన పూర్తి స్థాయి నిధులను కేంద్రమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కెవివి ప్రసాద్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు శీలం నారాయణరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలంతా ఐక్యంగా పోరాడి విభజన హామీలను సాధించుకోవడం ద్వారానే ఎపి అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రత్యేక హోదా సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ చలసాని శ్రీనివాసరావు, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రాము, ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్రప్రసాద్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ప్రసన్న, అశోక్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు జాన్‌సన్‌బాబు, శివారెడ్డి, పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు గనిరాజ్, భాస్కర్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.పవన్‌కుమార్, ఎస్ఎఫ్ఐ కృష్ణాజిల్లా అధ్యక్ష కార్యదర్శులు సుకేష్, సమరం, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు కల్యాణ్, లోకనాథ్, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు తెల్లాకుల బాజీబాబు, సిపిఎం చల్లపల్లి మండల కార్యదర్శి యద్దనపూడి మధు, సిఐటియు మండల కార్యదర్శి కరీముల్లా, సిఐటియు నాయకులు వెనిగళ్ల వసంతరావు, యార్లగడ్డ కుటుంబరావు, సిపిఐ జిల్లా ఇన్చార్జి కార్యదర్శి టి.తాతయ్య, పార్టీ పామర్రు నియోజకవర్గ కార్యదర్శి దగాని సంగీతరావు, నాయకులు సురేంద్రనాద్ బెనర్జీ, మహిళా సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షులు రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

నేడు మచిలపట్నం నుంచి సమరయాత్ర

సమరయాత్ర సోమవారం ఉదయం 10.30 గంటలకు మచిలీపట్నం రేవతి సెంటర్ నుంచి బయలుదేరి కోనేరు సెంటర్ వరకు సాగుతుంది. కోనేరు సెంటర్‌లో నేతలు ప్రసంగిస్తారు.

అనంతరం గూడూరు, పామర్రు మీదుగా ఉయ్యూరు చేరుకుంటుంది. ఉయ్యూరులో నేతలు ప్రసంగిస్తారు. అనంతరం విజయవాడ బెంజిసర్కిల్ నుంచి ఎంబివికె వరకు ర్యాలీ నిర్వహిస్తారు. సాయంత్రం మూడు గంటలకు ఎంబివికెలో సభ జరుగుతుంది.

అర్జునుడు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న దేవినేని ఉమా

బచ్చులకు దేవినేని ఉమా పరామర్శ

ప్రజాశక్తి-విజయవాడ రూరల్: విజయవాడ రమేష్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎంఎల్‌సి, టిడిపి సీనియర్ నేత బచ్చుల అర్జునుడును టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు ఆదివారం పరామర్శించారు. బచ్చుల అర్జునుడుకు మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని కోరారు. అనంతరం అర్జునుడు కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు.

ఆర్‌ఎస్‌ఎస్ భావాజాలంపై ఐక్య ఉద్యమం

●'భారత్ బచావో' సదస్సులో నేతల పిలుపు ●విశాఖ హక్కును రక్షించుకోవాలి

ప్రజాశక్తి-విజయవాడ : రాజ్యాంగ విలువలకు, దేశ సమగ్రతకు పెను ప్రమాదంగా తయారయిన మతోన్మాద బిజెపి- మోడీ ప్రభుత్వాన్ని రాబోయే సాధారణ ఎన్నికల్లో ఓడించాలని, ఆర్‌ఎస్‌ఎస్ భావాజాలాన్ని అడ్డుకట్ట వేయడంతోపాటు విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని రక్షించుకునేందుకు గ్రామీణ స్థాయి నుంచి దేశ స్థాయి వరకు రాజకీయాలకతీతంగా ప్రజాస్వామిక వాదులు, అభ్యుదయవాదులు, వామపక్షాలు, ఇతర రాజకీయపక్షాలు అందరూ ఏకమై విస్తృతంగా ఉద్యమించాలని 'భారత్ బచావో" రాష్ట్ర స్థాయి సదస్సులో పలువురు వక్తలు పిలుపునిచ్చారు. స్థానిక హనుమాన్ పేట కామ్రేడ్ దాసరి నాగభూషణరావు భవన్‌లో "భారత్ బచావో" ఆంధ్రప్రదేశ్ సదస్సు ఆదివారంఉదయం నుంచి సాయంత్రం వరకు సదస్సు జరిగింది. ఉదయం జరిగిన సభకు ఆహ్వాన సంఘం ఉపాధ్యక్షులు గంగాభవాని, కార్యదర్శి కాటం నాగభూషణం, మధ్యాహ్నం జరిగిన సభకు ఆహ్వాన సంఘం ఉపాధ్యక్షులు సీతామహాలక్ష్మి, కార్యదర్శి పివి రమణారెడ్డి అధ్యక్షత వహించారు. సదస్సుకు రాష్ట్రంలోని 16 జిల్లాల నుంచి 280 మంది ప్రతినిధులు హాజరుకాగా, సిపిఎం, సిపిఐ, ఇతర వామపక్షపార్టీలకు చెందిన నాయకులతో పాటు ఇతర రాజకీయపక్షాలు, వివిధ హక్కుల సంఘాలు, రచయితల సంఘాల నాయకులు, సామాజిక కార్యకర్తలు మొత్తం 25 మంది వరకు సభలో మాట్లాడారు. భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై నిత్యం దాడి చేస్తున్న బిజెపి-మోడీ పాలనను 2024 ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. అలాగే భిన్నత్వంలో ఏకత్వపు భారతీయ సంస్కృతిని కాపాడుకునేందుకు ఆర్‌ఎస్‌ఎస్ విషసంస్కృతి భావాజాలాన్ని ప్రజల నుంచి దూరం చేయాలని కోరారు. ఆంధ్రుల హక్కు అయిన విశాఖ హక్కును రక్షించుకోవడానికి అందరూ ఏకమై పోరాడాలని కోరారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం భారత రాజ్యాంగానికి వ్యతిరేకంగా పాలన చేస్తుందని దుయ్యబట్టారు. ఆర్‌ఎస్‌ఎస్ రాజకీయ విభాగం అయిన బిజెపి నరేంద్ర మోడీ నాయకత్వంలో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం, సౌభ్రాతత్వం, సెక్యులరిజం వంటి విలువలను పూర్తిగా కాలరాస్తుందని విమర్శించారు. హిందువులను ఉద్ధరించే పేరుతో దేశంలోని కార్పొరేట్ వర్గానికి దేశాన్ని దోచిపెడుతుందని ధ్వజమెత్తారు. యావత్తు దేశసంపదను అదాని, అంబానీ లాంటి క్రోని పెట్టుబడిదారులకు, బహుళజాతి కంపెనీలకు దారాదత్తం చేస్తుందని అన్నారు. దేశ ప్రజల జీవితాలను మోడీ పాలన అతలాకుతలం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. మోడీ దుష్ట పాలనకు వ్యతిరేకంగా దేశంలో ఆయా తరగతుల ప్రజల నుంచి ఉద్యమాలు రోజు రోజుకు ఊపందుకుంటున్నాయని అన్నారు. మోడీ పాలన వల్ల పెల్లుభుకుతున్న ప్రజా నిరసనను పక్కదారి పట్టించడం కోసం ఆర్‌ఎస్‌ఎస్, దాని అనుబంధ సంస్థలు దేశంలోని ఆయా మతాలు, ప్రాంతాలు, కులాల మధ్య చిచ్చుపెడుతూ అల్లకల్లోలం సష్టిస్తున్నారన్నారు. మత రాజ్యం ప్రజాస్వామ్య భావనకు శత్రువు అనీ, ఆ లక్ష్యం తో ప్రస్తుత రాజ్యాంగ సంస్థలు అన్నింటినీ విధ్వంసం చేస్తున్న బిజెపి ప్రభుత్వాన్ని రాబోయే 2024 సాధారణ ఎన్నికల్లో ఓడించక పోతే భారత దేశ అస్తిత్వానికే పెను ప్రమాదం ఏర్పడుతుందని అన్నారు. ఇటువంటి నేపథ్యంలో ఆర్‌ఎస్‌ఎస్ దాని రాజకీయ విభాగం అయిన బిజెపి నిజస్వరూపాన్ని దేశవ్యాప్తంగా గ్రామీణ స్థాయి వరకూ ప్రచారం చేయటానికి అందరం ఏకం కావాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామికవాది మాసియాంగ్ నేతత్వంలో భారత రాజ్యాంగ ప్రియాంబుల్ సామూహిక పఠనంతో ఉదయం సభ ప్రారంభమైంది. భారత్ బచావో కార్యక్రమం నిర్వహకులలో ఒకరైన డాక్టర్ గోపీనాథ్ ఉద్యమ ఆశయాలు, లక్ష్యాలను వివరించారు. సంయుక్త కిసాన్ మోర్చ రాష్ట్ర నాయకుడు వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ నూర్ అబ్దుల్ బాషా, ప్రముఖ బుద్ధిష్ట్ బొర్రా గోవర్ధన్, ప్రముఖ రాజకీయ ఆర్థిక విశ్లేషకులు నరసింహారెడ్డి, సిపిఐ నాయకులు అక్కినేని వనజ, విముక్తి చిరుతల కచ్చి రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్, సి పి ఐ (ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు వి ఉమామహేశ్వరరావు, వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా నాయకుడు అబ్దుల్ సుభాన్, యంసిపిఐ(యు) పోలిట్‌బ్యూరో సభ్యుడు ఉపేందర్ రెడ్డి ద్రావిడ సమ్మేళనం చైర్మన్ ఆకురాతి మురళీకష్ణ, కుల నిర్మూలన పోరాట సమితి అధ్యక్షుడు దుడ్డు ప్రభాకర్, సదస్సు కన్వీనర్ చిగురుపాటి భాస్కరరావు, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకుడు ఇండ్ల ప్రభాకర్, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి నైనాల శెట్టి మూర్తి, ఎస్ యు సి ఐ(సి) నాయకుడు సుధీర్, సిపిఐ (ఎంఎల్) రెడ్ స్టార్ పొలిట్ బ్యూరో సభ్యుడు మన్నవ హరి ప్రసాద్, సిపిఐ(ఎంఎల్) ప్రజా పోరు నాయకుడు పాటిబండ్ల కోటేశ్వరరావు, లాల్-నీల్ మైత్రి కార్యకర్త రేకా క్రిష్ణార్జున, ముస్లిం మేధావుల వేదిక అధ్యక్షుడుఖాన్ యజ్దాని డన్నీ, వివిధ హక్కుల సంఘాలు, రచయితల సంఘాల నాయకులు, సామాజిక కార్యకర్తలు మాట్లాడారు.

ఆరు కేంద్రాల ద్వారా పత్తి కొనుగోలు

(మొదటి పేజీ తరువాయి)

వైపే మొగ్గు చూపుతున్నారు.

ప్రశ్న : ఫీజుల రూపంలో ఏడాదికి మార్కెటింగ్ రాబడి ఎంత ?

మార్కెట్ ఫీజుల రూపంలో ఏడాదికి రూ.22.42 కోట్లను వసూలు చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం. అయితే గత ఏడాది చివరి నాటికి రూ. 9 కోట్లా 76 లక్షల 16 వేలు రాగా, వచ్చే మూడు మాసాల వ్యవధిలో మిగిలిన దానిని రాబట్టుకోవాల్సి ఉంది. పౌర సరఫరాల శాఖ వారు తమకు రూ.6 కోట్లు ఇవ్వాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఆర్థిక సంవత్సరం పూర్తయ్యేనాటికి లక్ష్యాన్ని పూర్తి చేస్తాం.

ప్రశ్న : విజయవాడలో కొత్తగా నిర్మించిన రైతు బజార్లను ఎప్పుడు ప్రారంభిస్తారు?

విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిధిలో నూతనంగా రెండు రైతు బజార్లను నిర్మించాం. ప్రత్యేక అవసరాల రీత్యా గతంలో ఉన్న రైతు బజార్లను తొలగించాం. వీటికి ప్రత్యమ్నాయంగా జిఎస్ రాజు రోడ్డులో 71 షాపులు, అలాగే సాంబమూర్తి రోడ్డులో 101 షాపులతో రైతు బజార్లను నిర్మించాం. కలెక్టర్, తమ శాఖ ఉన్నతాధికారులు, స్థానిక ఎంఎల్ఎ సూచనల మేరకు వీటిని తర్వలో ప్రారంభిస్తాం. కొత్తగా నిర్మించిన రైతు బజార్లలో అన్ని రకాల సదుపాయాలను కల్పించాం. కృష్ణలంక పోలీస్టేషన్ వద్ద నిర్మించిన రైతు బజారును ఇటీవలే ప్రారంభించాం. పాత ఫైర్‌స్టేషన్ సబ్ వే వద్ద ఉన్న రైతు బజార్‌ను తొలగిస్తాం.

ప్రశ్న : జిల్లాలో ఎన్ని రైతు బజార్లు ఉన్నాయి ?

మొత్తం 15 రైతు బజార్లు ఉన్నాయి. వీటిలో ఇప్పటికే 12 రైతు బజార్లు నడుస్తున్నాయి. జగ్గయ్యపేట, నందిగామ, కంచికచర్ల, ఇబ్రహీంపట్నం, మైలవరం, తిరువూరు, విజయవాడ నగరంలోని భవానీపురం, కృష్ణలంక, పటమట, సింగ్‌నగర్, పాయకాపురం, కేదారేశ్వరపేటలో రైతు బజార్లు నడుస్తున్నాయి. జిఎస్‌రాజు రోడ్డు, సాంబమూర్తి రోడ్డులో ఏర్పాటు చేసిన రైతు బజార్లు ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయి.

ప్రశ్న : ఈ-ఫామ్ మార్కెటింగ్ వ్యవస్థ పని తీరు ఎలా ఉంది?

ఈ మార్కెటింగ్ వ్యవస్థను ప్రవేశపెట్టడం వల్ల ప్రధానంగా బ్రోకర్ల వ్యవస్థ కట్టడి అవుతుంది. గ్రామాల్లో బ్రోకర్లు లేకుండా నేరుగా రైతులు మార్కెట్ యార్డులకు సరుకును తీసుకొచ్చి విక్రయించుకోవచ్చు. అంతర్జాతీయ స్థాయి ట్రేడర్లు కొనుగోలు చేస్తారు. విజయవాడ, కంచికచర్ల, నందిగామ, జగ్గయ్యపేట, మైలవరం, తిరువూరుల్లో మార్కెట్ యార్డులు ఉన్నాయి. వీటి నిల్వ సామర్థ్యం 54,100 టన్నులు.

IN THE COURT OF THE HON'BLE VII ADDL. DISTRICT JUDGE: CUM : MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL :: KURNOOL.

M.V.O.P. No. 69 /2021.

1.K. Sunkulamma and 3 others. ...Petitioners

Versus

1.Chilla Aruna and 2 others. ...Respondents

NOTICE TO RESPONDENT.No.1,

1.Chilla Aruna, W/o. Ch. Ramana, Aged 40 years, Owner of the lorry, R/o. H.No.9-25-23, Yadhavapuram Street, Kothapeta, Vijayawada, Krishna Dist. – 520001.

Where as the petitioners has filed said case against you for compensation under M.V. Act. If you have any objections for the same may appear either in person or through advocate on 30-01-2023 at 10-30 A.M. before the said court, failing which the matter will be decided in your absence.

By the order of the Hon'ble Court,
Dated: 30-01-2023.
Sri. M.L. Srinivasa Reddy,
Advocate for Petitioners

In the court of the VIII Addl District & sessions judge at Vijayawada C.R.L.A No: 3/2023
In CC No: 214/2017

Between:-
Nagina Begum, W/o Javeed Baig, Muslim, aged about 30 years, R/o Surya Apartments. Flat no: 402, Chintavari street, Opp Syndicate Bank, Gudiwada, Krishna dt.
..... Appellant/Accused
And
Mohammad Fathimunisa W/o Mohammad Altha Baig, Muslim, aged about 29 Years, Prop.Hema Fathima,s Beauty Parlour, R/o Katuru Road, Vuyyuru Village, & Mandal Krishna dt........Respondent / Complainant

Please take notice that the above C.R.L.A was filed on the file of VIII Addl. District & Sessions Judge: (Fast track Court) Vijayawada. The Respondent/Complainant in the above C.R.L.A i.e. Mohammad Fathimunisa described above is evading to receive the notices and as such the Hon'ble Court ordered the summons through substitute service by making publication in Prajasakti daily, Vijayawada, Krishna District edition, News Paper and posted the matter to 10-02-2023. The Respondent /Complainant is required to attend the Hon'ble Court on or before next date of hearing either personally or through her counsel and file her objections if any, failing the Honble court would continue with Proceedings.

By order of Hon' ble court
Smt. K.Kamala Kumari B.A.,LLM.,
Advocate
Jayaprakash Nagar,
Vijayawada-10
Ph: 7416884808

అర్జునుడు, తారకరత్న కోలుకోవాలని పూజలు

ప్రజాశక్తి-గన్నవరం(హనుమాన్ జంక్షన్)

ఆదివారం తెల్లవారుజామున కేసరపల్లిలోని తన నివాసంలో తీవ్రమైన గుండెపోటుకు గురై విజయవాడలోని ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గన్నవరం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి, ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు, కుప్పంలో నారా లోకేష్ యువగళం పాదయాత్రలో గుండెపోటుకు గురై బెంగళూరులోని

ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రముఖ సినీ నటుడు నందమూరి తారకరత్న త్వరగా కోలుకోవాలని టిడిపి నాయకులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. బాపులపాడు మండలం రంగన్న గూడెం గ్రామంలోని రామాలయంలో గ్రామ టిడిపి కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. సీనియర్ నాయకులు, సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాల కృష్ణారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు పుసులూరు లక్ష్మీనారాయణ, గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మొవ్వ వేణుగోపాల్, సీనియర్ నాయకులు కసుకుర్తి అర్జునరావు, మొక్కపాటి సత్యనారాయణ, కాట్రు పాపారావు, గొలుసు బలరామ్, కనకవల్లి యాకోబు, కొలుసు గంగాజలం, కసుకుర్తి కృష్ణ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సత్యనారాయణ స్వామి 70వ వార్షిక బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

రెండో అన్నవరంగా పేరు గాంచిన గుడ్లవల్లేరు లోని శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి వారి 70వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 31 నుంచి ఫిబ్రవరి 5వ తేదీ వరకు అత్యంత వైభవంగా జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. సోమవారం శ్రీవారిని పెళ్లి కుమారుని చేసే కార్యక్రమంలో ఉభయ దాతలు పొట్లూరి సత్యనారాయణ జ్యోతి దంపతులు నిర్వహిస్తారని పేర్కొన్నారు. మంగళవారం సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వారి వ్రతములు జరుగుతాయని పేర్కొన్నారు. ఉభయ దాతలు పుల్లేటి పాపారావు కృష్ణ జ్యోతి దంపతులు ఈ కార్యక్రమాలను చేయిస్తారని తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో దంపతులు పాల్గొంటరని తెలిపారు. బుధవారంనాడు స్వామి వారి రాయబారం మహోత్సవం, గురువారం స్వామివారి తిరు కళ్యాణోత్సవం పులి మురళీకృష్ణ రమాదేవి దంపతులచే నిర్వహించబడతాయని వివరించారు. శుక్రవారం గరుడోత్సవం కాగితం రాధాకష్ణ రుక్మిణి దంపతులచే కార్యక్రమం జరుగుతుందనీ, శనివారం స్వామివారి పవళింపు సేవ, ధ్వజ అవరోహణం ద్వాదశ రక్షణాలు పొట్టూరి సత్యనారాయణ జ్యోతి దంపతులచే నిర్వహిస్తారని వివరించారు. ఆదివారం స్వామివారి సన్నిధిలో భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనునట్లు తెలిపారు.

బ్రహ్మోత్సవాలకు ఆలయం ముస్తాబు

నిర్మాణంలో ఉన్న భవనం ఇదే...

నాసిరకంగా భవన నిర్మాణ పనులు

ప్రజాశక్తి-గన్నవరం(ఉంగుటూరు)

ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ స్వార్థం వల్ల ఉంగుటూరు ఎంపీడీవో కార్యాలయంపై నిర్మిస్తున్న మీటింగ్ హాలు భవన నిర్మాణ పనులు నాసిరకంగా జరుగుతున్నాయి. భవనం కడుతున్నారే కానీ ఒక్కరోజు కూడా నీటితో తడిపిన పాపాన పోలేదు. నాసిరకం మెటీరియల్ వాడుతుండడంతో భవనం తక్కువ కాలంలోనే దెబ్బతింటుందని అంటున్నారు. లక్షల రూపాయల ప్రభుత్వ నిధులు ఖర్చుచేస్తున్నా నిబంధనలను పాటించడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. బిల్లులు సక్రమంగా రావడం లేదని సాకుతో కాంట్రాక్టర్ నాసిరకంగా పనులు చేస్తూ, నాసిరకం మెటీరియల్ వాడుతున్నాడని విమర్శ ఉంది. ఇంజనీరింగ్, మండల పరిషత్ అధికారులు కానీ పట్టించుకోకపోవడంలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఎంతో ఖర్చు పెట్టి ఉంగుటూరు మండల పరిషత్తు కార్యాలయంపై మీటింగ్ హాలును ప్రైవేట్ కాంట్రాక్టర్లకు కట్టడానికి కాంట్రాక్ట్ ఇచ్చారు. దానికి సంబంధించి కట్టడానికి వాడిన ఇసుక ఎక్కువ, సిమెంటు తక్కువగా వాడినట్లుగా తెలుస్తోంది. వాటరింగ్ చేయటం లేదని అంటున్నారు. ఇప్పటికే నిర్మించిన గోడలు పాడైపోతున్నాయనీ, పగుళ్లు వచ్చే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు. ప్రభుత్వ అధికారులు నిరంతరం కార్యాలయంలో ఉంటున్నా దానిపై శ్రద్ధ పెట్టకపోవడం బాధాకరమని విమర్శిస్తున్నారు. ప్రజాప్రతినిధులు సైతం పట్టించుకోవటం లేదనే ఆరోపణలు కూడా ఉన్నాయి. కొంతమంది అధికారులు కమీషన్ కోసం పోటీ పడటం వల్లనే ఇలా జరుగుతోందనే విమర్శలు కూడా ఉన్నాయి.

వాడుతున్న నాశిరకం మెటీరియల్

అధికారులు చర్యలు తీసుకోవాలి
అజ్మీర వెంకటేశ్వరరావు, సిపిఎం ఉంగుటూరు మండల కార్యదర్శి

మీటింగ్ హాల్ నిర్మాణ పనుల్లో జరుగుతున్న అవకతవకలను నియంత్రించేందుకు అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలి. అధికారులు పర్యవేక్షించి నాసిరకంగా పనులు జరగకుండా చూడాలి. ఇప్పటివరకూ జరిగిన పనుల్లో లోపాలను సరిచేయాలి. సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

కంకటావలో మెగా ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-గూడూరు

గూడూరు మండలం కంకటావ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం నిరుపేద ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. కంకటావ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం రోగులకు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నేతత్వంలో ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఎన్నో నూతన సంస్కరణలు ప్రవేశపెట్టిన ఘనత ఎన్నో వ్యాధులను ఆరోగ్యశ్రీలో చేర్చడమే కాకుండా కార్పొరేట్ ఆస్పత్రిలో పేదలకు ఉచిత వైద్యం అందిస్తోందన్నారు. సుమారు 300 మంది ప్రజలు వైద్య సహాయం పొందారు. ఈ శిబిరంలో డాక్టర్ అశోక్ చక్రవర్తి, డాక్టర్ పి. విజయ్ కుమార్, డాక్టర్ జి. నందిని పాల్గొని బి.పి, షుగర్, విష జ్వరాలు, మెదడు, నరాలు, వెన్నుముక సమస్యలు, గుండెలో దడ ఛాతి నొప్పి, ఆయాసం, ఉబ్బసం, కరోనా వచ్చి తగ్గిన తర్వాత ఊపిరితిత్తుల సమస్యలు, థైరాయిడ్, మహిళల రుతుస్రావ సమస్యలు, కిడ్నీలో రాళ్లు ఇతర హార్మోన్ సమస్యలతో బాధపడుతున్న రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ వైద్య శిబిరంలో బూరగడ్డ రమేష్ నాయుడు, ఎంపీపీ సంఘ మధుసూదన్ రావు, స్టేట్ ఫైనాన్స్ కార్పోరేషన్ డైరెక్టర్ కారుమంచి కామేశ్వరరావు, జడ్పిటిసి వేముల సురేష్ రంగబాబు, మండల పార్టీ అధ్యక్షుడు గొరిపర్తి రవి, వర్కింగ్ ప్రెసిడెంట్ మోటే పల్లి రత్నరావు, వైస్ ఎంపీపీలు నేతల కుటుంబ రావు, పిచ్చుక గంగాధర రావు, వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు బుర్రా దుర్గారావు, పరిసర గ్రామ ప్రాంతాల ప్రజలు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు చేయించుకుంటున్న మంత్రి జోగి రమేష్

ఎపి రెవెన్యూ ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

ఏపీ రెవెన్యూ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా మచిలీపట్నం కలెక్టరేట్లో డిఆర్‌ఒ సిసి, సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న తూము వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. రెవెన్యూ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సమావేశం గుంటూరు పెన్షనర్స్ భవనంలో ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులుగా జె.ప్రభాకరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గిరీష్ మొలతాటి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చిట్టి బాబు, అసోసియేట్ అధ్యక్షులుగా గార మధుసూధనరావు, గుజ్జల దేవరాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు (మీడియా) రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శిగా పి.ఎ.కిరణ్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కాయల సతీష్ కుమార్, తూము వెంకటేశ్వరరావులను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

కిడ్నీ బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-ఘంటసాల

ఘంటసాల మండల పరిధిలోని పాపవినాశనం గ్రామానికి చెందిన నెరుసు ఉమాకాంత్ కిడ్నీ వ్యాధితో బాధపడుతుండగా, అవనిగడ్డకు శ్రీరామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యామ్ కిషోర్ నాయుడు ఆదివారం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. శ్రీకాకుళం గ్రామానికి చెందిన వైసిపి నాయకులు కొండవీటి కృష్ణమూర్తి ఉమాకాంత్ పరిస్థితిని శ్యామ్ కిషోర్ నాయుడికి తెలియజేయగా, స్పందించిన ఆయన ఉమాకాంత్ పరామర్శించి ఆరోగ్య స్థితిగతులు తెలుసుకొని రూ.7 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు శ్యాం కిషోర్ నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా కార్యదర్శి కొండవీటి కృష్ణమూర్తి, మాజీ ఎంపీటీసీ సభ్యులు ఆత్మూరి సీతారామరాజు, గాదె వెంకటేశ్వరరావు, మేకా పావులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న శ్యామ్‌కిశోర్‌నాయుడు

శివాజీ మృతి బాధాకరం : కొడాలి

ప్రజాశక్తి-గుడివాడ

ఇటీవల మరణించిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గానుగల నేతాజీ చిత్రపటానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) ఆదివారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు చూండూరి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కొడాలి నాని

భళా...బాలలు

అమరావతి బాలోత్సవంలో వేలాది మంది విద్యార్థుల ప్రదర్శనలు

ప్రజాశక్తి-వన్‌టౌన్ : అమరావతి బాలోత్సవం ఐదవ పిల్లల పండుగ ఆదివారం పొట్టిశ్రీరాముల చలువాది మల్లిఖార్జునరావు ఇంజనీరింగ్ కళాశాలలో అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. 31వ తేదీ వరకూ మూడు రోజుల పాటు జరిగే అమరావతి బాలోత్సవంలో కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లా, గుంటూరు, ఏలూరు జిల్లాల నుంచి 161 పాఠశాలలకు చెందిన 7,500 మంది విద్యార్థినీ విద్యార్థులు వివిధ సాంస్కృతికాంశాలలో తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ నేపథ్యంలో మొదటి రోజు ఆదివారం రెండు వేల మంది విద్యార్థినీ విద్యార్థులు తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. ఆ ప్రాంతమంతా పిల్లలు, పెద్దలతో కోలాహలంగా కనిపించింది. ముఖ్యంగా ఏడు సంవత్సరాల వయస్సు గల చిన్నారి చెర్రి డ్రమ్స్ వాయించి అందరినీ అలంరించాడు. ప్రపంచస్థాయిలో నాల్గో స్థానం పొందిన ఈ బుడతడు డ్రమ్స్ వాయించడంతో పెద్దలతో పాటు ఆరి తేరిన వాడిగా తన హావభావాలను ప్రదర్శించాడు. జానపద గీతాలు ఆలపించిన వేదిక (సినీ నటి జమున వేదిక) ముందు అందరి కరతాళ ధ్వనులు అందుకున్నాడు. ఇదే వేదికపై జానపద గీతాలు అలరించాయి. అడవుల ఆవశ్యకత, కన్నతల్లి ప్రేమ, అడవి తల్లికి దండాలు అంటూ సాగిన నృత్య ప్రదర్శన అందరినీ అలరింపజేసింది. ప్రముఖ హాస్య నటుడు అల్లు రామలింగయ్య వేదికపై ఏకపాత్రాభినయాలు, దేశభక్తి గేయాలు, మాయల పకీరు, బుడబుక్కలోడు, అల్లూరి సీతారామరాజు, దుర్యోధునిడి ఏకపాత్రాభినయం, దేశం కోసం రాజ్‌గురు, భగత్‌సింగ్ త్యాగాలు, పాలకుల విధానాల వల్ల నష్టపోతున్న రైతు, పురుగుల మందే శరణ్యమంటే ఆత్మహత్య చేసుకున్న వైనం వేదిక ముందు ఉన్న వారిని కంటతడి పెట్టించింది. డాక్టర్ హేమా హారిణి ప్రాంగణంలో వ్యర్థాల నుంచి ఆకర్షణీయమైన వస్తువులు ఎలా తయారు చేయవచ్చో బెస్ట్ ఫర్ వేస్ట్‌లో బుడతలు తమ ప్రావీణ్యాన్ని ప్రదర్శించారు. సినీనటుడు కృష్ణ పేరుతో ఏర్పాటు చేసిన వేదికపై లఘు నాటికలు అలరించాయి. ఆడపిల్లను చదవనిద్దాం...బతకనిద్దాం అనే సందేశంతో వేసిన నాటిక సభికులకు కంటతడి పెట్టించింది. యలవర్తి నాయుడమ్మ వేదికపై రేలా రేలా అంటు దుమ్ము రేగొట్టారు. సోలో నృత్యాలు, జానపద నృత్యాలు ప్రదర్శించి అలరించారు. ఈ వేదిక దగ్గర వందలాది మంది గంటల తరబడి కూర్చుని ఆసాంతం వీక్షించారు. పిఎస్ఎన్ పట్నాయక్ పేరుతో విద్యార్థులు మట్టిబొమ్మలు తయారు చేసి తమ ప్రతిభను చాటుకున్నారు. నాట్యాచార్యులు శివశంకర్ మాస్టర్ ప్రాంగణం పేరుతో ఏర్పాటు చేసిన వేదికపై శాస్త్రీయ నృత్యం సీనియర్స్ విభాగం 50 మంది తమ అద్భుత ప్రదర్శనలు ఇచ్చారు. కళాశాల,ప్రాంగణమంతా పిల్లలు, పెద్దలు సందడితో పండుగ వాతావరణం నెలకొంది ఐదో పిల్లల పండుగను తెలియజేస్తూ కళాశాల ప్రవేశ మార్గం కొత్తపేట రోడ్డుపై ఏర్పాటు చేసిన ప్రవేశ ద్వారం వీక్షకులను ఆకర్షించింది. వివిధ అంశాల్లో నిర్వహించిన పోటీల్లో వేలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు. బెస్ట్ ఫ్రం వేస్ట్‌లో జూనియర్, సీనియర్లకు పోటీలు నిర్వహించారు. సీనియర్లకు కార్టూన్ గీయటం, కవితా రచన, కథా రచన, వార్తా రచన, కథా విశ్లేషణ, అంతర్జాలంలో అన్వేషణ, దిపపత్రికా పఠనం పోటీలు నిర్వహించారు. సీనియర్స్ విభాగంలో జానపద నృత్యం, జానపద గీతాలాపన, ఏకపాత్రాభినయం, క్లాసికల్ డాన్స్, లఘు నాటికల్లో విద్యార్థులు తమ హావభావాలతో ఆకట్టుకున్నారు. బాలోత్సవం తొలిరోజున ఆద్యంతం పిల్లల ఆనందోత్సాహాల మధ్య హుషారుగా సాగింది.

ఘనంగా బాలోత్సవం ప్రారంభం

ముందుగా జరిగిన ప్రారంభ సభలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత చొక్కాపు వెంకటరమణ జాతీయ పతాకాన్ని, అమరావతి బాలోత్సవ కమిటీ గౌరవాధ్యక్షులు చలువాది మల్లిఖార్జునరావు బాలోత్సవం పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం బాలోత్సవం అధ్యక్షులు ఎస్‌పి.రామరాజు అధ్యక్షతన జరిగిన సభలో చొక్కాపు వెంకటరమణ ప్రారంభోపన్యాసం చేశారు. ఎంఎల్‌సి కె.ఎస్.లక్ష్మణరావు, కొత్తగూడెం బాలోత్సవం బాధ్యులు వాసిరెడ్డి రమేష్ బాబు, కమిటీ గౌరవాధ్యక్షులు చలువాది మల్లిఖార్జునరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బాలోత్సవం ప్రధాన కార్యదర్శి రామిశెట్టి కొండలరావు, ఉపాధ్యక్షులు, మాజీ ఎంఎల్‌సి బొడ్డు నాగేశ్వరరావు, గుమ్మా సాంబశివరావు, బి.సాంబిరెడ్డి, కార్యదర్శి జి. జోత్స్న, డాక్టర్ లక్కిరెడ్డి హనిమిరెడ్డి, ఎపి గ్రంధాలయ సంస్థ మాజీ కార్యదర్శి రావి శారద, ఎం.కష్ణకుమారి, యార్లగడ్డ సుబ్బారావు, యువి.రామరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.